ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

ఆదివారం 14 జూన్ 2026
సంపుటి: 28 సంచిక: 74
Sunday 14 June 2026
Vol.No 28 Issue No .74
హైదరాబాద్
Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## 15న తెరుచుకోనున్న పాఠశాలలు

- స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన
- వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్,జూన్13 : ఈ నెల 15 నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచే ప్రారంభం కావాల్సిన స్కూళ్లు ఎండల కారణంతో 15 నుంచి తెరచుకోనున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని వాపోతున్నారు. దీంతో విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ లేని, విద్యార్థులను లెక్కకుమించి ఎక్కించుకుని నడుపుతున్న వాహనాలపై




మిగతా2లో..

## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

### విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ



మిగతా2లో..

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం
- అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం



హైదరాబాద్,జూన్13 : హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ మిగతా2లో..

## సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

- 335 మంది డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు
- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి





మంచిర్యాల,జూన్13 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..

మిగతా2లో..



## ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

- గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం
- మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన భట్టి



## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

- కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క
- పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి



హైదరాబాద్,జూన్13 : కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ మిగతా2లో..

## ఫోన్ ట్యాపింగ్‌లో తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు



హైదరాబాద్,జూన్13 :ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో.. ఆయన స్టేట్‌మెంట్‌ను సిట్ రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికెళ్లి.. ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

## బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

- ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ,
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ



హైదరాబాద్,జూన్13 : మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి మిగతా2లో..

## సింగరేణిలో బొగ్గు మాయంపై విచారణ

- సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ



హైదరాబాద్,జూన్13 : సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500 కోట్లకు పైగా బకాయి పడి ఉంది. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో మిగతా2లో..

## సిరిసిల్ల మనబడి - మనబాధ్యతలో బండి

### ఎస్పీ హాజరు కాకపోవడంపై మంత్రి ఆగ్రహం



మిగతా2లో..

## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

- షబ్బీర్ అలీకి ఎఐసిసి షోకాజ్ నోటీస్



హైదరాబాద్,జూన్13 : కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో మిగతా2లో..

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

### 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు




హైదరాబాద్,జూన్13 : పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' మిగతా2లో..

## గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

- పార్టీ కార్యాకర్తలు ప్రచారంలోకి దిగండి
- నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్
- ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు



చండీగఢ్,జూన్13 : పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు మిగతా2లో..

## తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు

### కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క మృతి



కాకినాడ,జూన్13 : తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క మిగతా2లో..

## తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

- సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్
- టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక
- యూటర్న్ తీసుకున్న మరో ఎంపి కళ్యాణ్ బెనర్జీ
- అభిషేక్ బెనర్జీ తన కొడుకు లాంటి వాడంటూ కితాబు



న్యూఢిల్లీ ,జూన్13 : తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ మిగతా2లో..

## ఆర్‌జికెలో ప్రవేశాలకు ఎంపిక

- తాత్కాలిక జాబితా విడుదల చేసిన లోకేశ్



అమరావతి,జూన్13 :ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు మిగతా2లో..

## ఆర్‌జికెలో ప్రవేశాలకు ఎంపిక

2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితాను ఏపీ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ఎంపిక ఫలితాలను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 44,104 దరఖాస్తులు అందగా, వాటిలో 4,040 మంది విద్యార్థులను తాత్కాలికంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం విశేషం. గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ప్రవేశాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక లేఖలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సహాయం కోసం వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్ – 9552300009ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామీణ విద్యార్థుల సాధికారతకు ఈ ప్రవేశాలు దోహదపడతాయని ఏపీ విద్యాశాఖ అధికారులు తెలిపింది.

## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

వరించింది. 2025–26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

## బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## సింగరేణిలో బొగ్గు మయంపై విచారణ

సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి. సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలని లేఖలో పేర్కొన్నారు. 40 వేల మందికి పైగా ఉన్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతోపాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని చెప్పారు.

## సిరిసిల్ల మనబడి - మనబాధ్యతలో బండి

రాజన్న సిరిసిల్ల,జూన్13 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'మన బడి–మన బాధ్యత' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే హాజరు కాకపోవడంపై బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాత్రమే ఉండటంతో.. 'ఎస్పీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తాను సాధారణ కార్యకర్తను కాదని, కేంద్రమంత్రిగా పాల్గొంటున్న కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. అవసరమైతే బీఆర్ఎస్‌లో చేరాలని వ్యంగ్యంగా అన్నారు. అధికార యంత్రాంగం రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ ఆదేశించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

# సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన్' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కోసులో అభిషేక్ తరఫున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపిరి పీల్చుకుంది. కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలను కుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదఅని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

# గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు. బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. బర్నాలా, మోగా, బటాలా, బటిండా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా ఆప్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని, పార్టీ పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని, మరోసారి మాన్ సీఎం అయ్యేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కేజ్రీవాల్ కోరారు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పార్టీల పేరు చెప్పకుండా విపక్షాలపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకటి 'చిట్టా పార్టీ', మరొకటి 'ఫైటింగ్ పార్టీ', మూడో పార్టీ 'ఈడీ పార్టీ' అని అభివర్ణించారు. డ్రగ్స్ సమస్యలు, అంతర్గత పోరాటాలు, సెంట్రల్ ఏజెన్సీలతో ప్రత్యర్థులను భయపెట్టే పార్టీలుగా వారిని పోల్చారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి కోసం పని చేసే పార్టీ ఆప్ మాత్రమేనని, పంజాబ్ నేతల్లో అత్యంత నిజాయితీ కలిగిన ముఖ్యమంత్రుల్లో భగవంత్ మాన్ ఒకరని ప్రశంసించారు. గత ప్రభుత్వాలు అవినీతి, కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్నాయని, మాన్ హయాంలో అలాంటి ఆరోపణలు ఒక్కటి కూడా లేవని అన్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే ఈడీ, సీబీఐ చర్య తీసుకుని ఉండేవని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు. కేజ్రీవాల్ రోడ్‌షోలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పాల్గొన్నారు.

# వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హమీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హమీ ద్వారా చేపడుతామని తెలిపారు. పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేందప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## 15న తెరుచుకోనున్న పాఠశాలలు

కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెహికల్స్‌కు పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా 22,158 బస్సులు ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ, బస్సుల ఫిట్‌నెస్‌పై కూడా ఉండాలని పేర్కొంటున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదానికి దారి తీసే అవకాశముందని వాపోతున్నారు. స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి. వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండీషన్‌లో ఉండాలని అధికారులు పేర్కొన్నారు. బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉండా లని, బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా వెల్లడిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారి పై ప్రత్యేక రంగులు వేయించాలి. విద్యార్థులున్నారనే సంకేతాన్ని వాహనాల డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై గేటు వద్ద రద్దీ సమస్య లేకుండా చూడాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తాం అని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమా న్యాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి.




భద్రతా ప్రమాణాలు పాటి స్తూ పాఠశాలల బస్సులు నడపాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా బస్సుల స్థితిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని పాఠశాలల యాజమాన్యాలకు రీమార్కులు తెలియజేయాలి. ప్రమాదా లు జరుగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదండ్రు లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

న్యూఢిల్లీ,జూన్13 : భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

## తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు

అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ ఘటనతో కేసు దర్యాప్తులో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన సమయంలో ఆమె వెంట వెళ్లిన పెంపుడు కుక్క కూడా కొంతకాలం కనిపించకుండా పోయింది. మూడు రోజుల తర్వాత కుక్క తిరిగి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత నుంచి అది విచిత్రంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు దాన్ని పర్యవేక్షణలో ఉంచారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. దాని కదలికలను నిన్న ప్రత్యేకంగా పరిశీలించారు. చిన్నారి అదృశ్యం కేసులో ఆ కుక్క కీలక ఆధారాలు ఇవ్వవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో డాగ్ ప్రవర్తనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే, గత రెండు రోజులుగా కుక్క ఆరోగ్యం క్షీణించడంతో వెటర్నరీ వైద్యులు చికిత్స అందించారు. గతరాత్రి కుక్కకు ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ అనూహ్య ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి అదృశ్యం కేసులో పెంపుడు కుక్క మృతి కారణంగా కీలక ఆధారం కోల్పోయినట్లయింది. ఇప్పటివరకు ఆ కుక్క కదలికల ద్వారా కొంత సమాచారం లభించవచ్చని పోలీసులు ఆశించారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారిని ఎవరైనా అపహరించారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో తుని, కాకినాడ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది.

# అర్వపల్లి గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు

## వివో మరియు గ్రామపంచాయతీ భవన నిర్మాణలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 13 ( విజన్ ఆంధ్ర) :హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని అర్వపల్లి గ్రామంలో నిర్మించనున్న వివో భవనం మరియు నూతన గ్రామపంచాయతీ నిర్మాణ పనులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు...అర్వపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల సహకారంతో అర్వపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు, మహిళ సంఘాలు మరియు తదితరులు పాల్గొన్నారు....


## స్పోర్ట్స్ కరాటే-డో అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కౌటిల్ రెడ్డి ఎన్నిక



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 13 (విజన్ ఆంధ్ర) :స్పోర్ట్స్ కరాటే-డో అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మారంరెడ్డి కౌటిల్ రెడ్డి. ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు నాయిని సదానందం శనివారం తెలిపారు. హనుమకొండలోని ఆర్ ఈసీ సమీపంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో సంఘం సమావేశం జిల్లా సీనియర్ కరాటే మాస్టర్ పాపయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ట్రేజరర్ గా నాగమహేష్, ఆర్గనైజింగ్ సెక్రటేరిగా భరత్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ గా దుర్గప్రసాద్, సలీంపాషా, చీఫ్ అడ్వైజర్ గా గౌతమ్ సందీప్ తదితరులతో కూడిన నూతన కమిటీని అధ్యక్షులు నాయిని సదానందం తెలిపారు. తమ నియామకానికి సహకరించిన వారి నమ్మకాన్ని నిలబెడతామని తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సహాయ సహకారాలతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కరాటే మాస్టర్ ల సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు...

# రాష్ట్ర అభివృద్ధి బిజెపి ద్వారానే సాధ్యం

## -వార్డు కౌన్సిలర్ కమలాపూర్ ప్రభాకర్



నారాయణపేట, జూన్ 13 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బిజెపి ద్వారానే సాధ్యమని వార్డు కౌన్సిలర్ కమలాపూర్ ప్రభాకర్ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంలో వార్డులోని గణపతి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. మోడీ పాలన లో సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాల సంక్షేమం బిజెపి ద్వారానే సాధ్యమన్నారు. ముఖ్యంగా దేశ రక్షణ విషయంలో తమ ప్రభుత్వం ముందుంది అన్నారు. దేశం గర్వించదగ్గ నిర్ణయాలతో దేశ రక్షణ కోసం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో వచ్చిన తర్వాత రైతులకు నిరుద్యోగులకు యువతకు పెద్ద ఎత్తున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి ద్వారా పథకాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర బిజెపి నాయకులు దీనికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యకాంత్ టక్ , కోన మల్లికార్జున్, రవి నగరి కిషోర్, దత్తు కమలాపూర్, సంతోష్ ముదిరాజ్, సిరిగిరి అరవింద్, భోగం అన్వేష్ , చెన్నకేశవులు, అనూప్ తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ దర్శనానికి 24గంటల సమయం

తిరుమల,జూన్13: వేసవి సెలవులు ముగిస్తుండటంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుమల గిరులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో నిండాయి. స్వామివారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం సర్వదర్శన భక్తులను బాట గంగమ్మ ఆలయం నుంచి సర్వదర్శన క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులకు అల్పాహారం, తాగు నీరు, పాలు వంటివి శ్రీవారి సేవకుల ద్వారా అధికారులు అందజేస్తున్నారు. సీఆర్వో వద్ద వసతి గదుల కోసం, కళ్యాణకట్ట కేంద్రాల వద్ద భక్తులు బారులు తీరారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## ఈ నెల 21న తెలంగాణ అమరవీరుల స్మారక స్థూప ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలి



సూర్యాపేట, జూన్ 13 (విజన్ ఆంధ్ర) :ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసుకున్న అమరుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయుజేఏసి రాష్ట్ర నాయకురాలు కోతి మాధవి అన్నారు. ఈ నెల 21న నాగర్కర్నూల్ జిల్లా డిండి చింతపల్లిలో తెలంగాణ అమరవీరుల స్మారక స్తూప ఆవిష్కరణ ర్యాలీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం స్థానిక రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు 1200ల మంది ప్రాణత్యాగాలు చేసుకున్నారని కానీ ఫలాలు కొందరే అనుభవించారన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రస్తుత ప్రభుత్వం మానిఫెస్టోలో పెట్టి నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలంతో పాటు పెన్షన్, ఆరోగ్య కార్డులు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ నెల 21న చింతపల్లి డిండిలో తెలంగాణ అ మరవీరుల స్థూప ఆవిష్కరణ బహిరంగసభకు ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయుజేఏసి నాయకులు కె.రాజేంద్రప్రసాద్, పిన్నంపల్లి మురళి, నల్లెడ రాంరెడ్డి, హజారి గణేష్, లింగిడి నగేష్, నోముల ఉపేందర్, గోనె విజయమ్మ, కోట వనమ్మ, లక్ష్మమ్మ, దండు దేవిక, సుగుణమ్మ, సంతోష్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా బడుగుల జన్మదిన వేడుకలు



సూర్యాపేట జూన్ 13 (విజన్ ఆంధ్ర) :మాజీ రాజ్యసభ సభ్యులు, బడుగు బలహీన వర్గాల అభిమాన నాయకుడు, సూర్యాపేట జిల్లా భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలను శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బివైఎల్ యువసేన, టిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో టపాసులు పేల్చి భారీ కేక్ కట్ చేయడంతో పాటు జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, అనాధలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సేవా కార్యక్రమాలతో తమ అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి సహకారంతో మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ రాజ్యసభ సభ్యులుగా సూర్యాపేట జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయడంలో తన వంతు కృషి అందించారని అన్నారు. తన ఎంపీ నిధుల నుంచి జిల్లా కేంద్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అడిగిన వారికి కాదనకుండా నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. సూర్యాపేట జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులుగా నాయకులకు, కార్యకర్తలకు ఇలాంటి సమస్యలు వచ్చిన ముందుండి నడుస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆయనకు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలను ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు. అంతకుముందు టిఆర్ఎస్ నాయకులు ఢిల్లీ పావని ఉపేందర్ ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో బడుగుల లింగయ్య యాదవ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమారుడు బడుగుల యశ్వంత్, కౌన్సిలర్ పోతురాజు రమ్యశ్రీ, ఆత్మకూర్ మండలం పార్టీ అధ్యక్షులు తూడి నరసింహారావు, బిఆర్ఎస్ నాయకులు నెమ్మాది బిక్షం, బండారు రాజా, బడుగుల శ్రీనివాస్ యాదవ్, ఆకుల లవకుశ, బొమ్మగాని శ్రీనివాస్, ఖమ్మంపాటి రేణు బాబు, ఢిల్లీ పావని ఉపేందర్, కాసా శ్రీనివాస్ లతో పాటు బివైఎల్ యువసేన, టిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విదులు నిర్వహించాలి

## డాక్టర్ ఎస్ డి .రాంకుమార్ డిఎంహెచ్వో



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 13 (విజన్ ఆంధ్ర): ప్రతి ఉద్యోగి తమ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, రికార్డుల నిర్వహణ మరియు తమ పరిధిలోని ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకునేలా చూడాలని అనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.డి. రాంకుమార్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన బాలసముద్రం లోని వడ్డెర కాలనీ ,వడ్డేపల్లి మిడిదొడ్డి కాలనీ అంగన్వాడి సెంటర్, ఎస్బిహెచ్ కాలనీలో నిర్వహిస్తున్న అవుట్ రీచ్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని అలాగే వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారి దగ్గర అందుబాటులో ఉన్నటువంటి వ్యాక్సిన్ లను, వ్యాక్సిన్ భద్రపరిచే విధానం అలాగే వారు వ్యాక్సిన్ ఇస్తున్న తీరును గమనించారు. మాతా శిశు సంరక్షణ కార్డు లో తల్లికి బిడ్డకు అందిస్తున్న అన్ని సేవలు వివరాలను సరిగా నమోదు చేయాలని, వ్యాక్సిన్ డ్యూలిస్ట్ ప్రకారం అందరికి సమాచారం అందించాలని అన్నారు. ఎం సి పి కార్డ్ లో వివరాలు సరిగా నమోదు చేయని ఏ ఎన్ యం లను మందలించారుఅలాగే అక్కడికి వచ్చినటువంటి తల్లులతో వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం లో ఓపిక మరియు ఇతర ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను మరియు సాధించిన ప్రగతిని ఆయన సమీక్షించారు. మెడికల్ స్టోర్ మరియు వ్యాక్సిన్ భద్రపరిచే విధానాన్ని ఆయన పరిశీలించారు. వైద్యాధికారులు మరియు సూపర్వైజర్లు సిబ్బందికి అవసరమైనటువంటి సూచనలు అందిస్తూ వారి పనితీరును మెరుగుపరిచేలా, రికార్డుల నిర్వహణ సరిగా ఉండేలా చూడాలన్నారు. ఈ రోజు 53 మందికి సేవలందించామని 6 గురికి 20 డోసులు వాక్సిన్ ఇవ్వడం జరిగిందని వడ్డేపల్లి వైద్యాధికారి డాక్టర్ మాలిక డిఎంహెచ్ఓ గారికి వివరించారు వడ్డేపల్లి వైద్యాధికారి డాక్టర్ మాలిక బోడగుట్ట వైద్యాధికారి డాక్టర్ సృజనలు పాల్గొన్నారు.

# పద్యపదభారతి ప్రథమ వార్షికోత్సవము

## - పద్యపదభారతి గౌరవ అధ్యక్షులు బందప్ప గౌడ్, అధ్యక్షులు బొబ్లాద్ రాఘవేంద్రాచార్యులు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 13 ( విజన్ ఆంధ్ర ) : తెలుగు భాషకు పద్యము అనునది వెన్నముక లాంటిదని పద్యపదభారతి అధ్యక్షులు బందప్ప గౌడ్ అన్నారు. శనివారం నవాబు పేట్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో గల శ్రీ నంబియా స్వామి ఆశ్రమంలో పద్యపద భారతి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధ్యక్షులు బొబ్లాద్ రాఘవేంద్రాచార్యులు, వ్యవస్థాపక అధ్యక్షులు శతావధాని మలుగ అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ తెలుగు భాష మన అమ్మ భాష అని కొనియాడారు. పద్యం ఉన్నంత కాలము తెలుగు భాష నిలిచి ఉంటుందని వారు స్పష్టం చేశారు. లోతైన భావాలను వాడుక భాషలో చెప్పి సామాన్యుని కూడా జ్ఞానిని చేస్తాయి శతక పద్యాలు అని వారు గుర్తు చేశారు. సాహిత్య రంగంలో వశీకరణ శక్తిని నింపుకున్న ప్రక్రియ పాట అని ప్రశంసించారు. రాతి హృదయాలలోనూ చివుళ్ళను మొలిపించగల స్పర్శ పాటలోదాగి ఉన్నదని తెలిపారు. కవుల రచనల వలన సమాజం జాగృతం అవుతుందని పేర్కొన్నారు. భజన సంకీర్తనలతో సమావేశం ప్రారంభమై కవి సమ్మేళనముతో సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పద్యపద భారతి కొత్త కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బంధప్ప గౌడ్, అధ్యక్షులుగా బొబ్లాద్ రాఘవేంద్రచార్యులు, వ్యవస్థాపక అధ్యక్షులు శతావధాని మలుగ అంజయ్య, ఉపాధ్యక్షులుగా వెంకట్ రెడ్డి, రఘురాం రెడ్డి, అనంత కిషన్, రెడ్యా రాథోడ్, ప్రధాన కార్యదర్శి: మల్కనెల్లి లాల్ రెడ్డి, సహకార దర్శులు జంగయ్య, మొగులయ్య, సుధాకర్ రెడ్డి, దివాకర శాస్త్రి, సాంస్కృతిక కార్యదర్శి గడ్డమీది యాదయ్య, కోశాధికారిగా శ్రీనివాస్ చారి, మహిళా కార్యదర్శి కొండాపురం లక్ష్మి, కార్యవర్గ సభ్యులు కందాడ విట్టల్ రెడ్డి, అడవి రెడ్డి, భగవద్గీత రాములు, శ్రీరాములు, మీనపల్లి ముకుంద్ రెడ్డి, బుచ్చన్న, వెంకట్ తెలుగు. ఈ సమావేశంలో ఎం లాల్ రెడ్డి, సర్వోత్తమ్ ,ఎం రాజు, రఘురామరెడ్డి, ఆర్ వెంకటేష్, డి కృష్ణస్వామి, శ్రీనివాస్ చారి, రాములు, శంకరయ్య, శ్రీరాములు, హరిశ్చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వాసం...అభివృద్ధి...సంక్షేమంతో ప్రపంచ నేతగా ఎదిగిన ప్రధాని మోడీ

## ఎమ్మెల్సీ ఎ వి ఎన్ రెడ్డి




నారాయణపేట, జూన్ 13 (విజన్ ఆంధ్ర): ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల విశ్వాసం,అభివృద్ధి,సంక్షేమం అనే సూత్రంతో పని చేసి నేడు ప్రపంచ నేతగా ఎదిగా రని బిజెపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ వి ఎన్ రెడ్డి అన్నారు.శనివారం ఆయన నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ,కే.రతంగ్ పాండురెడ్డి,బి.కొండయ్య,పగుడాకుల శ్రీనివాసులు,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,ప్రధాన కార్యదర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ లతో కలిసి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ముందు దేశం తరువాత అభివృద్ధి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అలుపెరగక పని చేస్తూ 12 ఏళ్లుగా అతిపెద్ద ప్రజాస్వా మ్య దేశం అయిన భారత ప్రధానిగా రికార్డులు సృష్టిస్తూ కొనసాగుతున్నారని అన్నారు.గత ప్రభుత్వాల్లో అనేక స్కాములు జరిగాయని కేంద్రమంత్రులు,ఎమ్మెల్యేలు జైలు జీవితం గడిపారని అన్నారు.కానీ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో నేడు ప్రతి పక్షాలతో సహా మీడియా కూడా తప్పు పట్టని స్వచ్ఛ మైన పాలన అందిస్తున్నారని అన్నారు.దేశ రక్షణకు ప్రాధాన్యమిస్తూ స్వదేశీ పరిజ్ఞానంతో మిస్సైల్స్ వరకు ఉత్పత్తి చేసి సత్తా చేస్తారని తెలిపారు.అలాగే ప్రధానంగా రోడ్లు అభివృద్ధి చెందితే ప్రజలు అన్ని రకాలుగా బాగుంటారని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి తీసుకు వచ్చిన సడక్ యోజన కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో రోజుకు దేశ వ్యాపారంగా 35 కిలో మీటర్ల హైవే రోడ్లు పనులు సాగుతున్నాయని అన్నారు.అభివృద్ధి విషయానికి వస్తే స్వాతంత్రం వచ్చిన గత 70 ఏళ్లలో జరుగని అభివృద్ధి జరిగిందన్నారు.ప్రజల సంక్షేమం విషయంలో ఉచిత పథకాలు అమలు చేయకుండా సబ్సిడీలు ఇస్తూ ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుస్తున్నారని అన్నారు.కేవలం అధికారం కోసం ఉచిత హామీలు ఇస్తూ ఖజానా ఖాళీ చేశారని ఇండియా కూటమి పార్టీలను విమర్శించారు. ఏ పార్టీ మతరాజకీయాలతో మనుగడ సాధించలేవని అన్నారు.అదే సూత్రంతో ప్రధాని నరేంద్రమోడీ దేశం,అభివృద్ధి,సంక్షేమం స్ఫూర్తితో దేశాన్ని ముందుకు తీసుకొని పోతున్నారని అన్నారు.ప్రజలకు కావాల్సింది ఉచిత విద్య వైద్యం అన్నారు.వాటి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.కోవిడ్ సమయంలో అతి పెద్ద జనాభా ఉన్న భారతదేశంలో ప్రజలు కుప్పతెప్పలుగా చనిపోయారని వివిధ దేశాలు భావించాయని కానీ స్వదేశీ పరిజ్ఞానంతో కొవిడ్ వ్యాక్సిన్ తయారు చేసి దేశ ప్రజలను కాపాడుతూ ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ పంపి ఆదుకున్నారని అన్నారు.చరిత్రను మరువద్దని మరిస్తే పతనం తప్పదని అన్నారు.ఈ సమావేశంలో బిజెపి జిల్లా,పట్టణ నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

## సీతంపేట గ్రామంలో వివో మరియు గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 13 (విజన్ ఆంధ్ర) :హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో వివో భవనం మరియు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంతో పాటు సామాజిక, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.గ్రామపంచాయతీ భవనాలు గ్రామ పాలనకు కేంద్ర బిందువులుగా, వివో భవనాలు గ్రామ ప్రజల సామాజిక అవసరాలకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్నామని చెప్పారు. సీతంపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళ సంఘాలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు..

# కలెక్టరేట్ ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి

**-యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి**

**-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవనం పరిశీలన..**



.కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో),: జూన్ 13 : కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు పూర్తవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు మృతి

## స్థానికుల ఆందోళన.. కంపెనీ ముందు ధర్నా

హైదరాబాద్,జూన్13: నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన కారు కిందే బాలుడు శివం పడిపోయాడు. తీవ్ర గాయాలయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ముందు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ కంపెనీ ఎదుట బైఠాయించి బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. న్యాయం జరిగేలా చూస్తామంటూ పోలీసులు నచ్చజెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమి ంచారు.బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దక్షిణ కోస్తా రైల్వే
విశాఖపట్నం
Follow us on @SCoRailway
వెబ్సైట్: www.scor.indianrailways.gov.in

టెండర్ నోటీస్ నెం. ఇఎల్ఇసి-టిఆర్ఎస్-జిటిఎల్-26-27-ఇ-టిఎన్-4 తేది 09.06.2026

ఈ క్రింది సంతకందారు నుండి ఈ క్రింది పని కోసం 03.07.2026న మధ్యాహ్నం 12:00 గంటల వరకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.నం.1. టెండరు నెం: ఇఎల్ఇసి- టిఆర్ఎస్-జిటిఎల్-26-27-ఇ-టిఎన్-4 తేది 09.06.2026. వివరణ: గుంతకల్లు ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో GC2010 మోడల్ డిజాల్వ్ గ్యాస్ అనాలిసిస్ (DGA) పరికరం కోసం మూడు (03) సంవత్సరాల కాలానికి వార్షిక నిర్వహణ ఒప్పందం (AMC). సుమారు విలువ రూ.లలో: 4,51,886.00. బయానా సొమ్ము డిపాజిట్: 9,000.00. కాంట్రాక్టు కాలం: 36 నెలలు.

ముగింపు తేది మరియు సమయం: 03-07-2026న 12.00 గం.లకు

టెండర్ దాఖలు చేయడానికి మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in లో లాగిన్‌కండి. టెండర్‌కు సంబంధించి ఏదైనా సవరణ జారీ చేయవలసి వస్తే, అది ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరుదారులకు గమనిక: 1) ఈ ఇ-టెండర్‌లో పాల్గొనడానికి/బిడ్ చేయడానికి, కాంట్రాక్టర్‌కు చెల్లుబాటు అయ్యే డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) ఉండాలి. 2) టెండర్ సమర్పించే ముందు, రైల్వే ద్వారా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడిన పై టెండర్లకు సంబంధించిన సవరణలను టెండరుదారులు గమనించి, దానికి అనుగుణంగా వ్యవహరించాలని సూచించడమైనది. 3) టెండరుదారులు బయానా సొమ్ము డిపాజిట్ ఖర్చును నెట్-బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాలి. అలా చేయని పక్షంలో, ఆఫర్ స్పందన లేనిదిగా పరిగణించబడి తిరస్కరించబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ఎలక్ట్రిక్ లోకోషెడ్, గుంతకల్

SCoR-A028

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కోసం మరియు టెండర్ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి https://www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

## ప్రజలకు సేవ చేసేందుకే అధికారులు ముందు ఉండాలి

నారాయణపేట, జూన్ 13 (విజన్ ఆంధ్ర) ప్రజలకు సేవ చేసేందుకే అధికారులు తమ పనితీరును నిర్వహించాల్సిందిగా నారాయణపేట మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ అధికారులకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ లో జరిగిన సంఘటనపై ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల తీరును ప్రజలు పసిగట్టి అధికారులను ఏసీబీ అధికారులకు పట్టించడంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఎంతో సంతోషంగా తమ తమ సమస్యలను పరిష్కారం అవుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంతేకాకుండా ప్రజల సమస్యలను విస్మరించే విధంగా అధికారులు చూస్తుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చూడాల్సిందిగా ఆయన కోరారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోని తీర్చే విధంగా చూడాలని ఆయన కోరారు.

## రాబోయే ఐదు రోజులు జిల్లాలో భారీ వర్షాలు

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట జూన్ 13 (విజన్ ఆంధ్ర): రాబోయే ఐదు రోజుల పాటు సూర్యాపేట జిల్లాలో వర్షాలు, పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాకుండా గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడవచ్చని పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు ఉరుములు వస్తున్నప్పుడు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల కింద ఉండొద్దని సూచించారు. శిథిలావస్థ ఇళ్లలో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని వీలైతే పక్కా భవనాలలో ఆశ్రయం పొందాలని తెలిపారు. వర్షం పడే సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు

## జాంబవంతుని గుడి స్థలాన్ని కాపాడుకుంటాం

**-దళిత సంఘాల నాయకుల హెచ్చరిక,**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):జగద్గిరిగుట్ట లో నెలకొన్న జాంబవంతుని గుడి స్థలాన్ని కబ్జా చేయడాన్ని ఖండిస్తూ వెంటనే ఆ కబ్జా నుండి ఆ స్థలాన్ని కాపాడుకోవాలని నేడు దళిత సంఘాల నాయకులు సమావేశమై తీర్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,జగద్గిరిగుట్ట లో వెలిసిన జాంబవంతుని గుడి స్థలంలో కొందరు స్థలాన్ని అమ్ముకొని అక్కడి నిర్మాణాలను ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తూ ఆ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని నిన్న కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులను కోరడం జరిగిందని, గతంలో కూడా ఇదే స్థలంపై అక్రమ నిర్మాణాలు ఏర్పడితే రెవెన్యూ అధికారులు కూల్చివేశారని కానీ మళ్ళీ మళ్ళీ ఆ నిర్మాణాలు ఏర్పడుతున్నాయని, కాబట్టి మరోసారి అలాంటి నిర్మాణాలు ఏర్పడకుండా దళిత సంఘాల నాయకులందరూ ఐక్యమై పోరాడుతామని అన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జాంబవంతుని గుడి స్థలం అమ్ముకోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే వారి పైన కూడా కేసులు పెడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దొరవి బాబు, రాములు, ఎం ఆర్ పి ఎస్ నాయకులు అల్వాల భాస్కర్, ఆర్టీసీ బాబు, ముఖేష్, రమేష్,సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

**ఐదురుగు వైమానికి సిబ్బంది మృతిచెందినట్లు సమాచారం**

గౌహతి,జూన్13: అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు.

## ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది

**ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణ కు నిధులు మంజూరు**

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 13,(విజన్ ఆంధ్ర)ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం లో గల శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మంచిర్యాల, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహంకాళి స్వామి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు 802 కోట్ల రూపాయలతో ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ప్రజల ఆకాంక్ష మేరకు 70 కోట్ల రూపాయల నిధులతో గూడెం దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని, పిప్రి వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి చే గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 37 రోజుల వ్యవధిలోనే పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా గూడెం గుట్ట పరిధిలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్యం, వ్యవసాయ, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిలో నియోజకవర్గ శాసనసభ్యులు కృషి అభినందనీయమని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్తులో ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం అనేక విధాల అభివృద్ధికి కట్టుబడిఉందన్నారు. రాబోవు గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అనంతరం పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 70 లక్షల రూపాయల మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సంఘ భవనాల నిర్మాణం, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో సి.సి. రోడ్డు పనులు, 2 కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలో 58 ఓట్ల రూపాయల అంచనా నిధులతో ఆలయ పున: నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలలోని మోదెల, ద్వారక, గుడి రేవు గ్రామాల సమీపంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమవైపున 74 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా నిధులతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బూత్‌లో గెలిస్తే రాష్ట్రంలో గెలిచినట్టే“

**బిజెపి అరాచకాలను అణగదొక్కుదాం**

**షాద్‌నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్**

**ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి**

**డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కాంగ్రెస్ నాయకుల పిలుపు**

**బిప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయించాలి**

**టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి యోగీశ్వర్ రెడ్డి**

**షాద్‌నగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బిఎల్ఎలకు ఓటర్ల జాబితా సవరణపై భారీ అవగాహన శిక్షణ శిబిరం**

రంగారెడ్డి బ్యూరో,జూన్ 13(విజన్ ఆంధ్ర): షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు (బిఎల్ఎలు) అవగాహన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి యోగీశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షురాలు జ్యోత్స్న చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముకలాంటివారని, ప్రజాస్వామ్య పరిరక్షణలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాబోయే ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. “బూత్‌లో గెలిస్తే రాష్ట్రంలో గెలిచినట్టే“ అంటూ శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని, బూత్ స్థాయిలో విజయం సాధిస్తే రాష్ట్ర స్థాయిలో విజయం సాధించినట్టేనని అన్నారు. యువత, మహిళలు, అణగారిన వర్గాలకు చెందిన



అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు బిఎల్ఎలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతిపాదిత తొలగింపులను జాగ్రత్తగా పరిశీలించి, ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా తొలగించబడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో అందజేసిన బిఎల్ఏ హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా అధ్యయనం చేసి, చట్టపరమైన నిబంధనలు, ఎన్నికల కమిషన్ మార్గ దర్శకాలను అవగాహన చేసుకోవాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతోందని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని నాయకులు సూచించారు. బూత్ స్థాయిలో ఓట్లను కాపాడుకుంటే ప్రజాస్వామ్యాన్ని కూడా కాపాడినట్లేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, చౌదరిగూడ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కొత్తూరు మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, నల్లమోని శ్రీధర్, నందిగామ మండల అధ్యక్షుడు కుమార్ గౌడ్, కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వరప్ప, బాలరాజ్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, బిఎల్ఎలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దుబ్బాకలో పోషణ శక్తి నిర్మాణం మధ్యాహ్న భోజన కాంప్లెక్స్ స్థాయి ట్రైనింగ్ సమావేశం



దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ :: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల దుబ్బాక కాంప్లెక్స్ లో కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ మధ్యాహ్న భోజనం కాంప్లెక్స్ స్థాయి ట్రైనింగ్ సమావేశం స్థానిక ప్రధాన కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పట్నం భూపాల్ అధ్యక్షతన జరిగింది. పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయులు , వివిధ పాఠశాలలోని కుక్ కం ఎల్పర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి జె. ప్రభుదాస్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ప్రతిరోజు పేద పిల్లలకు నాణ్యతగా అందించాలని కోరారు. డి. సి. ఈ బి కన్వీనర్ చక్రపాణి గారు వారానికి మూడు రోజులకు గుడ్డు, మూడు రోజులు జావా తప్పనిసరిగా అందించాలని, ప్రభుత్వం ఈ సంవత్సరం నెల నెల డబ్బులు ఇవ్వడంతో మీ దుబారా డబ్బుల ఖర్చు తగ్గిందనీ అని సూచించారు. ప్రధానోపాధ్యాయులు పట్నం భూపాల్ మాట్లాడుతూ ఈరోజు ఎజెండా వారీగా ట్రైనింగ్ నిర్వహిస్తున్నామని, కార్మికుల చే మధ్యాహ్న భోజనం వంటను ఈరోజు పాఠశాలలో వడ్డించి, నిర్వహించి సన్నద్ధం చేయడం జరుగుతుందని దానికి తగిన ఏర్పాటు చేయడం జరిగింది అని తెలియజేశారు. నిరంతరం పిల్లలకు మంచి భోజనం అందించడంలో కార్మికులు ముఖ్యపాత్ర వహిస్తున్నారని, విద్యార్థుల శక్తి సామర్థ్యాలు పెరగడంలో మీ పాత్ర ఎంతో ఉందని తెలియజేశారు, మధ్యాహ్న భోజనంలో శుభ్రంగా ఉండాలని సీనియర్ ఉపాధ్యాయురాలు రజిత తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఆర్ .పి శ్రీనివాసు, కాంప్లెక్స్ కన్వీనర్ మధుసూదన్,సి అర్ పి రవి, ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధికి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే నాగరాజు

హన్మకొండ జిల్లా ప్రతినిధి , జూన్ 13 (విజన్ ఆంధ్ర): గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత మరియు ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం రోజున హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని జయగిరి గ్రామంలో వివో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం అనంతసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన వివో భవనాన్ని ప్రారంభించి, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు, సమాజానికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళల సంఘాలకు శాశ్వత వేదికగా వివో భవనాలు ఉపయోగపడతాయని, సంఘాల సమావేశాలు, పొదుపు కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు ఈ భవనాలు కేంద్ర బిందువుగా మారనున్నాయని తెలిపారు..మహిళా సంఘాలు బలోపేతం కావడం ద్వారా



గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని, మహిళల సాధికారతే కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని ఆయన పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వేలాది మంది మహిళలు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారని, ప్రభుత్వం వారికి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారుఅదేవిధంగా, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామస్థుల సమస్యలను స్థానికంగానే పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాల అమలును సమర్థవంతంగా నిర్వహించడం కోసం ఆధునిక సదుపాయాలతో గ్రామపంచాయతీ భవనాలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు..గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని, రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, ఆరోగ్య రంగాలతో పాటు మహిళా సాధికారత, గ్రామీణ పరిపాలన బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు...గ్రామాల అభివృద్ధి కేవలం భవనాల నిర్మాణంతో ముగిసిపోదని, వాటిని ప్రజలకు ఉపయోగపడేలా సద్వినియోగం చేయడం కూడా అందరి బాధ్యత అని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, మహిళా సంఘాలు మరింత చైతన్యంతో ముందుకు సాగి గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు...ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు...

## కోటకొండ రోడ్డు పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం

**రోడ్డు కోసం బిజెపి,బి ఆర్ ఎస్ రాస్తారోకో**

నారాయణపేట, జూన్ 13 (విజన్ ఆంధ్ర) :నారాయణపేట మండ లం కోటకొండ రోడ్డు ను వెంట నే పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం అని బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు హెచ్చరించారు. అప్పక్ పల్లి నుంచి కోటకొండ,కోయిల్ కొండ రోడ్డులో అమిరెడ్డి పల్లి, బొమ్మనుపాడ్ మధ్య 4 కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం



బిజెపి,బి ఆర్ ఎస్ పార్టీల ఆధ్వర్యంలో శనివా రంకోటకొండ, అభంగపూర్,బందగొండ,తిరుమలాపూర్,ఉంటకుంట తాండా,బోమన్ పాడ్ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అప్పక్ పల్లి వద్ద హైదరాబాద్ రోడ్డుపై భారీ రాస్తారోకో నిర్వహించారు. దాంతో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు పగుడాకుల శ్రీనివాసు లు ,జిల్లా బిజెపి ఉపాధ్యక్షు డు కంచె శ్రీనివాసులు,బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీ పీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షు డు వేపూర్ రాములు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో అప్పక్ పల్లి నుంచి కోటకొండ మీదుగా కోయిల్ కొండ వరకు డబుల్ రోడ్డు మంజూ రు అయి పనులు జరిగా యని అన్నారు. కానీ అమిరె డ్డి పల్లి నుంచి బొమ్మను పాడు వరకు 4 కిలోమీటర్ల రోడ్డును అసంపూర్తిగా ఉంచారన్నారు. దాంతో గత రెండు ఏళ్లుగా రోడ్డు పూర్తికా క ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా అవస్థలుపడుతు న్నారన్నారు .వర్షాకాలంలో రొద్దు గుంతలమయం అయి అనేక ప్రమాదాలు జరుగుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశా రు. ఏ అత్యవసర పరిస్థితి ఉన్న తొందరగా వెళ్లడానికి విలుకాకగర్భిణీలు,విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 ఏళ్లు కావస్తున్న ఎమ్మెల్యేకు అధికారులకు ఏమాత్రం ఈ రోడ్డుపై పట్టింపు లేదన్నా రు. పక్కనే సి ఎం నియోజక వర్గంలో గ్రామ గ్రామానికి డబుల్ రోడ్డు పూర్తి అవు తున్నా కేవలం 4 కిలోమీటర్ల రోడ్డును ఎమ్మెల్యే పట్టించు కోవడం లేదని విమర్శించా రు. వెంటనే రోడ్డు ను పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎమ్మె ల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచు లు,బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు,మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.

## అనంతగిరిలో అధికమాస యజ్ఞాలు

**-2026 జూన్ 13 శనివారం ఘనంగా కృష్ణ యజ్ఞం నిర్వహణ**

**-యజ్ఞంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి దంపతులు**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 13 (విజన్ ఆంధ్ర) : వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో అధికమాసం సందర్భంగా 30 రోజులపాటు నిర్వహిస్తున్న యజ్ఞాల్లో భాగంగా శనివారం కృష్ణ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల మహేష్ రెడ్డి దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికమాసంలో యజ్ఞాలు నిర్వహించడం వల్ల సర్వ శుభాలు కలుగుతాయని ఆలయ పురోహితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ సర్పంచ్ పార్థసారథి, బీఆర్ఎస్ యువనేత కొప్పుల అనిల్ రెడ్డి, దోమ మండల మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

## పంట మార్పిడిపై రైతులు దృష్టి పెట్టాలి
## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జూన్13,(విజన్ ఆంధ్ర): రైతుల ఐక్యత,పరస్పర సహకారం,ప్రభుత్వ మద్దతుతో నల్గొండ జిల్లాను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారుశనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు.నల్గొండ పేరు వినగానే బత్తాయి గుర్తుకొస్తుందని,జిల్లాలో గతంలో 4 లక్షల ఎకరాల్లో బత్తాయి సాగు జరిగేదని,కాలక్రమేనా వివిధ కారణాల వల్ల అది 40 వేల ఎకరాలకు తగ్గడం బాధాకరమన్నారు.మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా రైతులు కూడా మారాల్సిన అవసరం ఉందని,ఎప్పుడూ వరిపైనే ఆధారపడకుండా బత్తాయి లాంటి పంటలు,ఇతర ఉద్యాన పంటలను సాగు చేయాలని సూచించారు.పంట మార్పిడిపై తప్పనిసరిగా దృష్టి సారించాలని,ఈ విషయంలో రైతులకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ




ఉంటుందని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ పంటలు సాగు చేసే రైతులకు సహకారం అందిస్తున్నదని, ముఖ్యంగా వరి పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు సన్న ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామన్నారు.బత్తాయికి పేరు ప్రఖ్యాతులు గాంచిన నల్గొండ జిల్లాలో తిరిగి బత్తాయిని ఎక్కువ మొత్తంలో సాగు చేయాల్సిన అవసరం ఉందని,బత్తాయి ఆరోగ్యపరంగా కూడా మనిషికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఉద్యాన పంటల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి అంతర్జాతీయ స్థాయి ఫ్రూట్ మార్కెట్‌కు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.రైతులు పంట మార్పిడితో పాటు ఉద్యాన పంటలను సాగు చేయాలని,నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు.అవసరమైతే హైదరాబాద్‌లో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి సిట్రస్‌ను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో,రైతుల సమస్యలు,భవిష్యత్తు అవకాశాలు,ఆధునిక సాగు పద్ధతులు,మార్కెటింగ్,ఎగుమతులు తదితర విషయాలపై ఆలోచిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బత్తాయిలో అనేక కొత్త రకాల వంగడాలు వచ్చాయని,ఇవి రైతులకు ప్రయోజనకరంగా ఉంటాయన్నారు.నల్గొండ బత్తాయికి ఎప్పటి నుంచో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని,రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా,రైతు బీమా,మహిళలకు రుణాలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నదని చెప్పారు.అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర డెయిరీ డెవలప్మెంట్ చైర్మన్ అమిత్ రెడ్డి తదితరులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డి.రాజి రెడ్డి,రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి,చెవిటి వెంకన్న,పావని రెడ్డి,ఉద్యాన శాఖ రాష్ట్రస్థాయి అధికారులు,జిల్లా అధికారులు,అభ్యుదయ రైతులు,బత్తాయి రైతులు పాల్గొన్నారు.అనంతరం మంత్రి ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను ప్రారంభించారు.

# ఆదర్శ రైతు సాయినికి ఉత్తమ రైతు అవార్డు

భద్రాద్రికొత్తగూడెం,జూన్13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదర్శ రైతు సాయిని మధుసూదన్ రావుకు ఉత్తమ రైతు అవార్డు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ విశ్వవిద్యాలయ ఫౌండేషన్ డే సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. సాయిని మధుసూదన్ రావు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే 'రైతులకు నేస్తం' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేయనున్న కొత్త వంగడాలు, చిరుధాన్య పంటల సాగు విధానాలు, నూతన వ్యవసాయ సాంకేతికతలను తన పొలంలో అమలు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని పలువురు రైతులు, వ్యవసాయ అధికారులు పేర్కొంటూ అభినందనలు తెలిపారు.

# 17న నల్గొండకు సీఎం రేవంత్ రెడ్డి

## 14 వేల కోట్ల హ్యాం రోడ్లకు శంకుస్థాపన,లక్ష మందితో భారీ సభ


ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జూన్13,(విజన్ ఆంధ్ర):ఈనెల17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా కనగల్ మండలానికి రానున్నారు.14 వేల కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రంలో నిర్మించనున్న హ్యాం రోడ్లకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు.రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం కనగల్ మండల కేంద్రంలో సభాస్థలి,పైలాన్,హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఒకే రోజున ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని రహదారులను డబుల్ రోడ్లుగా మార్చే మొదటి ప్యాకేజీని కనగల్ మండలం ధర్వేశిపురం నుంచి డిండి వరకు నిర్మించే రహదారితో ప్రారంభిస్తున్నామన్నారు.ఆర్ అండ్ బి రహదారులతో పాటు మరో 7 వేల కోట్ల రూపాయలతో గ్రామాల నుంచి మండలాలకు,మండలాల నుంచి జిల్లా కేంద్రాల వరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్లు నిర్మించనున్నామని తెలిపారు. వీటికి వచ్చే వారం పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపనజరుగుతుందన్నారురెండు సంవత్సరాల్లో హ్యాం రోడ్లన్నింటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని,రోడ్లు ఉంటేనే



పరిశ్రమలు,సంక్షేమం వస్తాయని చెప్పారు. గత ఏడాది కాలంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి రిజర్వ్ బ్యాంక్ ద్వారా అప్పుగా నిధులు తీసుకొని రోడ్లు నిర్మిస్తున్నామన్నారు.నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని హ్యాం రోడ్లు పూర్తయ్యేలోగా అంటే 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామన్నారు.దీని ద్వారా జిల్లాలో రెండు పంటలకు సాగునీరు అందుతుందని, ఇది తన కల ప్రాజెక్టు అని చెప్పారు.ఏఆర్పి కాలువల లైనింగ్‌కు 450 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని,ఈ శంకుస్థాపన కూడా అదే రోజు ఉంటుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే హ్యాం రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 6300 కిలోమీటర్ల రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నామని వెల్లడించారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో తాగునీటి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని,ఈ పనులకు కూడా సీఎం కనగల్‌లోనే శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.ఈ సంవత్సరం నల్గొండ నియోజకవర్గంలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించామని,జిల్లా వ్యాప్తంగా 1800 కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు.కేంద్ర సీఆర్ఎఫ్ నిధుల ద్వారా నల్గొండ నుంచి ధర్వేశిపురం వరకు స్ట్రెయిట్ రోడ్ నిర్మాణం చేపట్టామని,కనగల్ జంక్షన్ అభివృద్ధిని కూడా హ్యాం రోడ్లలో చేర్చామన్నారు.హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరైందని, దీని పక్కనే బుల్లెట్ ట్రైన్ డీపీఆర్ కూడా సిద్ధమవుతోందని చెప్పారు.ముఖ్యమంత్రి సభకు సుమారు లక్ష మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేశారు.సభను విజయవంతం చేసేందుకు ట్రాఫిక్,తాగునీరు,టెంట్లు,వాహనాలు,లైటింగ్,లైవ్ టెలికాస్ట్ వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ,రైతు భరోసా,మహిళలకు వడ్డీలేని రుణాలు,ఉచిత బస్సు,విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,అల్పాహారం,ప్రతి నియోజకవర్గంలో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్,జెడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,డీపీఓ శంకర్ నాయక్,డీఎస్పీ శివరాం రెడ్డి,ఆర్ అండ్ బి డీఈ గణేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఒకే చెట్టుకు ఉరి వేసుకున్న వివాహిత,,యువకుడు

## కొల్లాపూర్ మండలం ఏల్లూరు గ్రామంలో విషాదం



కొల్లాపూర్ జూన్ 13 : (విజన్ ఆంధ్ర) నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో గ్రామానికి చెందిన వివాహిత రేణుక (21) యువకుడు శివ (25) ఇద్దరూ గ్రామ శివారులో ఒక బావి సమీపంలో ఉన్న మామిడి చెట్టుకు ఒకే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రేణుక కు మరొక వ్యక్తితో వివాహమై ఏడది పాప ఉంది. ఇటీవల పుట్టింటికి వచ్చిన ఆమె , యువకుడితో కలిసి సూసైడ్ చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న కొల్లాపూర్ ఎస్సై బండారి సురేష్, ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు. మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సూసైడ్ మృతిపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై బండారి సురేష్ తెలిపారు

# కంటి చూపును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

## శుక్లాల సమస్యకు శస్త్రచికిత్సే శాశ్వత పరిష్కారం.
## ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
## జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ,జూన్13: ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుక్లాల కారణంగా చూపు మందగించిన వారు ఆలస్యం చేయకుండా శస్త్రచికిత్స చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శంకర నేత్రాలయ వైద్యులు డా. మాధవ్, డా. అపర్ణల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్‌లోని చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనిషికి ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన వరాల్లో కనుచూపు ఒకటని అన్నారు. కంటి చూపు ద్వారా మనం ప్రపంచాన్ని దర్శించగలుగుతామని, విద్యాభ్యాసం, ఉపాధి, దైనందిన కార్యకలాపాలు, సామాజిక జీవనం సజావుగా సాగేందుకు చూపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ చాలామందిలో శుక్లాలు ఏర్పడడం సహజమని తెలిపారు. శుక్లాలు వచ్చినప్పుడు వస్తువులు మసకగా కనిపించడం, చదవడంలో ఇబ్బంది కలగడం, వెలుతురు పట్ల అసౌకర్యం, రాత్రివేళల్లో సరిగా కనిపించకపోవడం, రంగులను స్పష్టంగా గుర్తించలేక పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే చూపు మరింత తగ్గిపోయి సాధారణ జీవనం కూడా కష్టతరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. శుక్లాలకు ప్రస్తుతం అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన చికిత్స శస్త్రచికిత్సేనని కలెక్టర్ తెలిపారు. శస్త్రచికిత్స ద్వారా మసకబారిన కంటి లెన్స్‌ను తొలగించి, దాని స్థానంలో కృత్రిమ లెన్స్‌ను అమర్చడం వల్ల చూపు గణనీయంగా మెరుగుపడుతుందని చెప్పారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి

## పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కిరణ్ డిమాండ్

భువనగిరి,జూన్13: భువనగిరి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు అన్ని పూర్తయిన నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని, నెల రోజుల్లో ప్రారంభించకుంటే వీధి వ్యాపారులతో ప్రారంభం చేయిస్తామని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి.కిరణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను శనివారం పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏవి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో వీధి వ్యాపారస్తులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను అన్ని వసతులతో నిర్మించడం జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల కాలం గడిచిపోయిన ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వీధి వ్యాపారులకు శాపంగా మారిందన్నారు. నిర్మించిన భవనంలోని ఎలక్ట్రికల్ వైర్లు, ప్రహరికి నిర్మించిన గ్రిల్స్ ను కట్ చేసి దొంగలించిన వస్తువుల విలువ సుమారూ రూ.25 లక్షలని మున్సిపల్ కమిషనర్, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు దర్యాప్తునకు నోటుకోలేదన్నారు. భువనగిరి ఎమ్మెల్యే అతడి క్యాంప్ కార్యాలయ ఆవరణలోనే ఉన్నా కూడా మార్కెట్‌ను పరిశీలించకపోవడం, దానిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తూ ఉంటే భువనగిరి పట్టణంపై అతనికి ఉన్న ప్రేమ నామ మాత్రమే అని పట్టణ ప్రజలకు అనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# బాసర ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన ఎక్సలెంట్ విద్యా కుసుమం

- మాకు మేమే సాటి మాకు లేరు ఎవరు పోటీ
- పోటీ పరీక్షలలో ముందువరుసలో ఎక్సలెంట్ భాషా హై స్కూల్ విద్యార్థులు.
- మొన్న పాలిసెట్లో 72వ స్టేట్ ర్యాంక్ సాధించిన త్రిశాంత్
- నేడు ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన డి. షణ్ముఖ ప్రియా..
- విద్యార్థినిని సత్కరించి అభినందనలు తెలిపిన చైర్మన్ యూసఫ్ షరీఫ్

పినపాక, జూన్ 13(విజన్ ఆంధ్ర): కృషితో నాస్తి దుర్భిక్షం అన్నట్లుగా.. విద్యార్థి పట్టుదల ఉపాధ్యాయుడి నాణ్యమైన బోధన ఈ రెండు కలిసిన వేళ లక్ష్యం తమ చెంతకు చేరుతుంది. దీనికి నిదర్శనమే ఎక్సలెంట్ భాషా హై స్కూల్ వ ప్రతి పోటీ పరీక్ష లోను మాకు మేమే సాటి మాకు లేరు ఎవరు పోటీ అని విజయాలను తమ ఖాతాలో వేసుకుంటున్న ఎక్సలెంట్ భాషా హై స్కూల్ విద్యార్థులు. మొన్నటికి మొన్న పాలిసెట్లో త్రిశాంత్ స్టేట్ 72వ ర్యాంకు సాధించిన విషయం మరువక ముందే నేడు వెలువడిన ట్రిబుల్ ఐటీ ఫలితాల్లో ఆర్ జి యు కె టి బాసరలో సీటు సాధించిన డి షణ్ముఖ ప్రియ. ఆమెను అభినందించి ఘనంగా సత్కరించిన ఎక్సలెంట్ భాషా హై స్కూల్ చైర్మన్ యూసఫ్ షరీఫ్, డైరెక్టర్స్ ఖాదర్,



గబ్బర్, బండారు నరేంద్ర, ముక్కు వెంకట నర్సారెడ్డి , ప్రిన్సిపల్ అంకం సురేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాసర ట్రిబుల్ ఐటీ లో సీటు కోసం రాష్ట్రం నలుమూలల నుండి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు వేల సంఖ్యలో పోటీ పడుతుంటారు. కారణం ఒక్కసారి ఇందులో సీటు సాధిస్తే ఆరు సంవత్సరాల ఇంజనీరింగ్ విద్యాభ్యాసం పూర్తిచేసుకుని ఉద్యోగం సాధించే బయటికి వస్తారు అనేది అక్షర సత్యం. పినపాక మారుమూల ప్రాంతంలో బట్టి విధానానికి స్వస్తి పలుకుతూ ఎక్సలెంట్ భాషా హై స్కూల్ యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు అనడానికి పోటీ పరీక్షల్లో వరస ఫలితాలే నిదర్శనం అనడంలో అతిశయోక్తి లేదు అని అన్నారు. ప్రతి పోటీ పరీక్షలో తమ విద్యార్థులను ముందు వరుసలో నిలబెడుతున్న ఎక్సలెంట్ భాషా హై స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు, పలువురు విద్యావంతులు ప్రశంసలజల్లు కురిపిస్తున్నారు.

# ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా 'మేమున్నాం' టీమ్

## రూ. 9,500 ఆర్థిక సాయం అందజేత

చర్ల, జూన్ 13 (విజన్ ఆంధ్ర):అకాల ప్రకృతి వైపరీత్యం ఒక నిరుపేద కుటుంబంపై పంజా విసిరింది. నిలువ నీడ లేక, కట్టుబట్టలతో రోడ్డున పడ్డ ఆ కుటుంబానికి 'మేమున్నాం' స్వచ్ఛంద సంస్థ ఆపన్న హస్తం అందించిందిచర్ల మండలం, కొత్తగూడెం ఎస్సీ కాలనీకి చెందిన కూరపాటి వెంకటేశ్వరరావు – శ్రీదేవి దంపతులు రోజువారీ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు, ఇటీవలే సంభవించిన తీవ్రమైన గాలిదుమారాలకు వీరి రేకుల షెడ్డు ఇల్లు పూర్తిగా కూలిపోయింది. గూడు కోల్పోయి, మరమ్మతులు చేయించుకునే ఆర్థిక స్థోమత లేక ఆ దంపతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు, అటు ఎండలకు, ఇటు వర్షాలకు ఆశ్రయం లేక దిక్కుతోచని స్థితిలో వారు 'మేమున్నాం' సంస్థను ఆశ్రయించారు.ఏస్పందించిన 'మేమున్నాం' బృందం బాధిత కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న 'మేమున్నాం' టీమ్ వెంటనే స్పందించింది. తమ వాట్సాప్ గ్రూపుల ద్వారా ఫండ్ రైజింగ్ చేపట్టి, దాతల సహకారంతో రూ. 9,500 సేకరించారు. శనివారం ఉదయం 11:30 గంటలకు చర్ల లోని సంస్థ కార్యాలయంలో, సభ్యులు కార్తికేయ, రోహిత్ ల చేతుల మీదుగా ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.ఏమానవీయ కోణంలో ఈ సందర్భంగా 'మేమున్నాం' సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ ప్రకృతి



ప్రకోపానికి ఆ నిరుపేద కుటుంబం రోడ్డున పడటం చాలా బాధాకరం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం మన కనీస బాధ్యత, సభ్యులందరూ కలిసి తలా ఒక చేయి వేసి ఈ సహాయాన్ని అందించడం అభినందనీయం, ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేస్తాం అని తెలిపారు.ఏఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బి.వి. ప్రతాప్, దొడ్డి సూరిబాబు, సొల్లంగి నాగేశ్వరరావు, కవ్వాల రాము, మామిడి సాయి, రామ్మోహన్ రావు, మెంతుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. పేద కుటుంబానికి అండగా నిలిచిన 'మేమున్నాం' బృందంపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# మ్యాగీ నూడిల్స్‌లో పురుగులు సోషల్ మీడియా వార్తలను ఖండించిన నెస్లే

న్యూఢిల్లీ,జూన్13: మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై నెస్లే ఇండియా సంస్థ స్పందించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. మ్యాగీ ప్యాకెట్‌లో పురుగులు కనిపించాయని ఓ నెటిజన్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో ఈ అంశంపై చర్చ మొదలైంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఈ ఫిర్యాదుపై దృష్టి సారించి, సంస్థ నుంచి వివరణ కోరింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో నెస్లే స్పష్టం చేసింది. మ్యాగీ నూడుల్స్‌పై ఆరోపణలు ఒక ధ్రువీకరించని సోషల్ మీడియా ఖాతా నుంచి వచ్చాయని నెస్లే ఇండియా స్పష్టం చేసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని సంప్రదించి నమూనా పంపించాలని పలుమార్లు కోరినా ఎలాంటి స్పందనా రాలేదని తెలిపింది. దీంతో అసలు ఉత్పత్తి నమూనాను పరిశీలించే అవకాశం లభించలేదని పేర్కొంది. ఆరోపణలు వచ్చిన బ్యాచ్‌కు సంబంధించిన రిఫరెన్స్ నమూనాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించినట్టు నెస్లే వెల్లడించింది. ఆ పరీక్షల్లో ఎలాంటి పురుగులు లేదా ఇతర కలుషిత పదార్థాల ఆనవాళ్లు కనిపించలేదని, ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు పూర్తి అనుగుణంగా ఉందని రిపోర్ట్ వచ్చినట్టు కంపెనీ పేర్కొంది.

# మద్యపాన నిషేధం పేరుతో దోపిడీ

## వైసిపి ప్రభుత్వ హాయంలో పెద్ద ఎత్తున అక్రమాలు
## మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శలు

అమరావతి,జూన్13:మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్దిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు. చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు. కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కంపెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసి వేశారని డోలా బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

# అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

## తాళం పగులగొట్టి సోదాలు చేశారని టిఎంసి ఆరోపణ

కోల్‌కతా,జూన్13: తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం గాలిస్తున్న పోలీసులు కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి వెళ్లి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. సోదాల అనంతరం పోలీస్ టీమ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలిసిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఆశచూపి కొందరి నుంచి సుమిత్ రాయ్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ఈ సోదాలు జరిపినట్టు చెబుతున్నారు. పోలీసుల తనిఖీలపై అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. పోలీసులు వచ్చినప్పుడు తన ఇంటికి తాళం వేసి ఉందని, తాళాలు పగులగొట్టి మరీ సోదాలు జరిపారని చెప్పారు. 'నా ఇల్లు మొత్తం గాలించారు. ఆయనను (సుమిత్ రాయ్) నేను దాచిపెట్టానో లేదో దర్యాప్తు ఏజెన్సీని అడగండి' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దీనికి ముందు శుక్రవారంనాడు అభిషేక్ బెనర్జీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఆరోపణలపై జూన్ 16న తమ ముందు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నేరుగా నోటీసులు అందజేసేందుకు అభిషేక్ నివాసానికి సీఐడీ టీమ్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో సుమారు రెండు గంటల వేచి చూసిన అధికారులు కార్యాలయంలోని ఉద్యోగులకు నోటీసు అందజేసి వెళ్లిపోయారు. అభిషేక్ వ్యాఖ్యలపై బాగుయాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తొలుత విచారణ జరిపారు. అనంతరం కేసును సీఐడీకి అప్పగించారు. కాగా, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రాకు చెందిన పలు నివాసాలపై ఈడీ అధికారులు శనివారంనాడు దాడులు జరిపారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల కార్మికత్వం నుంచి ఆరు మంది చిన్నారులను రక్షించిన స్కోప్ సంస్థ, జిల్లా యంత్రాంగం పోలీసులు"




భువనగిరి జూన్13 :ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), జిల్లా యంత్రాంగం, పోలీసు అధికారుల సహకారంతో నిర్వహించిన సంయుక్త తనిఖీ, అమలు చర్యల ద్వారా బాల కార్మికత్వంలో ఉన్న ఆరు మంది చిన్నారులను విజయవంతంగా రక్షించింది. ఈ రక్షణ చర్య ప్రభుత్వం జూన్ నెలను లి"బాల కార్మిక వ్యతిరేక కార్యాచరణ మాసం"లిగా నిర్వహిస్తున్న నేపథ్యంలో చేపట్టబడింది. బాల కార్మికత్వంలో ఉన్న పిల్లలను గుర్తించడం, రక్షించడం, పునరావాసం కల్పించడం, బాలల అక్రమ రవాణాను నిరోధించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. రక్షించబడిన చిన్నారులు 10 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు కలవారు. వీరు వివిధ వాణిజ్య సంస్థల్లో పని చేస్తూ, వారి శారీరక, మానసిక, విద్యా అభివృద్ధికి హానికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరు అధిక పని గంటలు, తగిన వేతనం లేకపోవడం, ప్రమాదకరమైన పని వాతావరణంలో పనిచేస్తున్నట్లు వెల్లడైంది. రక్షణ అనంతరం సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించబడ్డాయి. అదేవిధంగా, పిల్లలకు పునరావాసం, విద్యలో తిరిగి చేర్పించడం, చట్టం ప్రకారం లభించే పరిహారం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించే చర్యలు చేపట్టబడ్డాయి. రక్షణ కార్యక్రమాలతో పాటు, స్కోప్ సంస్థ వివిధ గ్రామాలు, సమాజాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యువజనులు పాల్గొని బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికత్వం, బాలల అక్రమ రవాణా నివారణపై చైతన్యం పొందారు. ఈ సందర్భంగా స్కోప్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ:"బాల కార్మికత్వం నుంచి రక్షించబడిన ప్రతి చిన్నారి తన విద్య, భద్రత, గౌరవప్రదమైన జీవన హక్కులను తిరిగి పొందుతున్నాడు. బాల కార్మికత్వం పిల్లల బాల్యాన్ని, భవిష్యత్తును దోచుకుంటుంది. ఏ చిన్నారి పనిస్థలంలో కాకుండా పాఠశాలలో ఉండాలి. బాల కార్మికత్వం నివారణ, బాలల అక్రమ రవాణా నిర్మూలన, రక్షించబడిన ప్రతి చిన్నారికి రక్షణ, పునరావాసం, మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు ప్రభుత్వ శాఖలు, చట్ట అమలు సంస్థలతో కలిసి నిరంతరం పనిచేస్తాము." అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జూన్ నెలను బాల కార్మిక వ్యతిరేక కార్యాచరణ మాసంగా నిర్వహిస్తున్నారు. బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వం మధ్య ఉన్న బలమైన సంబంధాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా తనిఖీలు, రక్షణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు, అక్రమ రవాణా నిరోధక కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తున్నాయి. స్కోప్ సంస్థ, దేశంలోనే అతిపెద్ద బాలల పరిరక్షణ నెట్వర్క్ అయిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) భాగస్వామ్య సంస్థగా పనిచేస్తోంది. 250కి పైగా భాగస్వామ్య సంస్థలతో కూడిన ఈ నెట్వర్క్ సమాచార భాగస్వామ్యం, రాష్ట్రాల మధ్య సమన్వయం ద్వారా బాలల అక్రమ రవాణా కేసులను గుర్తించి, పిల్లలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఏప్రిల్ 2023 నుండి మార్చి 2026 వరకు జేఆర్సీ నెట్వర్క్ భాగస్వామ్య సంస్థలు దేశవ్యాప్తంగా 1,45,000 మందికి పైగా పిల్లలను అక్రమ రవాణా నుంచి రక్షించాయి, వీరిలో ఎక్కువ మంది బాల కార్మికత్వంలోకి నెట్టబడిన వారే. ముఖ్యాంశాలు: బాల కార్మికత్వం నుంచి 6 మంది చిన్నారుల రక్షణ స్కోప్ సంస్థ, జిల్లా యంత్రాంగం, పోలీసుల సంయుక్త చర్య నిందితులపై చట్టపరమైన చర్యల ప్రారంభం పిల్లల పునరావాసం, విద్యలో తిరిగి చేర్పించే ప్రక్రియ కొనసాగింపు జిల్లాల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణ బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వంపై మరింత కట్టుదిట్టమైన నిఘా.

## సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచాలి

### కిషన్ రెడ్డికి ఎంపి వంశీకృష్ణ సవాల్



మంచిర్యాల,జూన్13: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ సవాల్ విసిరారు. సింగరేణి కార్మికులపై కేంద్రానికి నిజంగానే ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే... రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను తక్షణమే పెంచి చూపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని గుండెల్లో మోసి... ఉద్యమాన్ని ముందుకు నడిపిన వీరులు సింగరేణి కార్మికులని ఆయన కొనియాడారు. మంచిర్యాల వేదికగాశ్రీరాంపూర్ సింగరేణి ఏరియా ఆధ్వర్యంలో... ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సింగరేణి కారుణ్య నియామకాల పత్రాల పంపిణీ జరిగింది. డిపెండెంట్ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు... ఈసందర్భంగా ఎంపీ వంశీకృష్ణ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం... రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపు కోసం... పార్లమెంట్‌లో గళం విప్పాను, ఇకముందూ గళం విప్పుతూనే ఉంటా అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో రూ. 150 కోట్ల భారీ వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సింగరేణి కార్మికులు అనగానే... అందరికీ గుర్తొచ్చేది కాకా వెంకటస్వామి అని... నాడు నష్టాల్లో, అప్పుల్లో ఉన్న సింగరేణి సంస్థను కాపాడిన మహోన్నత వ్యక్తి కాకా అని ఆయన గుర్తుచేశారు. సింగరేణి ఉద్యోగులకు ఐటీ పర్క్స్ (ఎ÷ ఖుసీబ) నుంచి మినహాయింపు ఇవ్వాలని, అలాగే సింగరేణిలో మారుపేరు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు సుఖంగా ఉంటేనే సంస్థ బాగుంటుందని... కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో పార్లమెంట్ వేదికగా అలుపెరగని పోరాటం చేస్తానని ఎంపీ వంశీకృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

## గిరిజన సంప్రదాయాలపై పేపర్ ప్రజెంటేషన్

### రీసెర్చ్ స్కాలర్ రాజేంద్రపప్రసాద్‌కు సన్మానం

భద్రాద్రికొత్తగూడెం,జూన్13: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్వహించిన 'గిరిజన జీవితం, సాంప్రదాయాలు, గతానుభవాలు, అంతర్‌దృష్టులు, దూరదృష్టి' అంశంపై ఈ 12, 13 తేదీల్లో రెండు రోజుల సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్, సమక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్, ద్రావిడ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుబ్బయ్య చారి హాజరయ్యారు. ఈ సెమినార్‌లో బూర్గంపహాడ్ మండల పరిధిలోని కోయగూడెంకు చెందిన ట్రైబల్ రీసెర్చ్ ఫెలో పాయం రాజేంద్రప్రసాద్ పాల్గొని 'కోయ గిరిజనుల ప్రాచీన ఆహారపు అలవాట్లు' అంశంపై రాసిన వ్యాసాన్ని సమర్పించారు. ఈ సెమినార్‌లో ఆ వ్యాసం పలువురు ప్రముఖుల నుండి అభినందనలు అందుకోగా రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

## జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్ అక్రమంగా వచ్చినట్లు గుర్తింపు

హైదరాబాద్,జూన్13: హ ఐదరాబాద్ జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు పోలీసులు నిర్ధారించారు. గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలో అ÷-దదె ఇంట్లో బంగ్లా జాతీయులు నివాసం ఉంటున్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించగా.. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేవని గుర్తించారు. ఇతర డాక్యుమెంట్లు లేకుండానే భారత్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లోనూ బంగ్లాదేశీయులు చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు వీరిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారిని మెదక్ జిల్లా జోగిపేట డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. వీరిందరినీ తిరిగి వారి దేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ విచారణకు ఎంపి హాజరు

### బిఆర్ఎస్ నీచంగా వ్యవహరించిందన్న అనిల్ కుమార్ యాదవ్

హైదరాబాద్,జూన్13: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతమైంది. ఇందులో భాగంగా శనివారం కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను ప్రత్యేక విచారణ బృందం సిట్ సుదీర్ఘంగా విచారించింది. జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో దాదాపు అరగంట పాటు ఈ విచారణ కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో అనిల్ కుమార్ యాదవ్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు గుర్తించిన పోలీసులు, ఇందుకు సంబంధించిన కొన్ని సాంకేతిక ఆధారాలను ఆయన ముందు ఉంచి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఏ ఏ రోజుల్లో, ఏ సమయాల్లో ఫోన్ కాల్స్ ట్యాప్ చేశారనే వివరాలను అధికారులు ఆయనకు వివరించినట్లు తెలిసింది. ఇదే కేసులో అనిల్ కుమార్ యాదవ్ తండ్రి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు సిట్ నిర్ధారించింది. అయితే, ఆయన వయోభారం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నేరుగా వారి ఇంటికే వెళ్లి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. సిట్ విచారణ అనంతరం ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీ అత్యంత నీచ రాజకీయాలకు పాల్పడింది. నా ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు గుర్తించి నన్ను విచారణకు పిలిచారు. ఏ రోజు, ఏ టైమ్‌కు ట్యాపింగ్ జరిగిందో కొన్ని కీలక ఆధారాలను నా ముందు ఉంచి వివరాలు అడిగారు. అప్పట్లో మా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం మేము పార్టీ కార్యక్రమాలను ఆర్గనైజ్ చేసేవాళ్లం. అయితే, మేము ఏదైనా కార్యక్రమం తలపెట్టి ఇంటోంచి గడప దాటకముందే మా ఇంటి ముందు పోలీసులు వాలిపోయేవారు. మాకు అప్పట్లో అస్సలు అర్థం కాలేదు.. మేము ఎ÷-లాన్ చేసుకున్న విషయాలు పోలీసులకు ఎలా తెలుస్తున్నాయా అని ఆశ్చర్యపోయేవాళ్లం. ఇప్పుడు సిట్ ఆధారాలు చూపిస్తుంటే అసలు విషయం అర్థమైంది'. అని అనిల్ కుమార్ యాదవ్ చెప్పారు. తనతో పాటు తన తండ్రి అంజన్ కుమార్ యాదవ్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని అనిల్ కుమార్ మండిపడ్డారు. ఆయన స్టేట్‌మెంట్ తీసుకోవడానికి అధికారులు ఇంటికి వస్తామని చెప్పారని ఆయన వెల్లడించారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులు ఎంతటివారైనా సరే చట్టపరంగా శిక్ష అనుభవించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

## బిర్యానీ తిన్న వైద్య విద్యార్థులకు అస్వస్థ

### ఫుడ్ పాయిజనింగ్ అయినట్లు గుర్తింపు

గోదావరిఖని,జూన్13: నగరంలోని సిమ్స్ వైద్యకళాశాల విద్యార్థులకు శుక్రవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయింది. ఈ ఘటనలో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖని నగరంలో సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(సిమ్స్) చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగిసాయి. అనంతరం సరదా గా 12 మంది కవిత థియేటర్ సమీపం లో ని ఓ హోటల్ లో విందు భోజనానికి వెళ్లి మండీ బిర్యానీ ఆరగించాచి తిరిగి ఎవరి రూమ్ లకు వారు వెళ్లి పోయారు. ఇందులో 12 మంది విద్యార్థులలో 11 మంది కి ఫుడ్ ఫాయిజన్ అయింది. దీంతో అందరికీ వాంతులు విరోచనాలు మొదలయ్యాయి. దీంతో వారిని గోదావరిఖనికి లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే 8 మందికి తీవ్ర, ముగ్గురికి స్వల్పంగా అస్వస్థత కు లోనయినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం వారిని వైద్యుల సలహా మేరకు డిశ్చార్జ్ చేశారు. అయితే హోటళ్లలో నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు ఇంత జరిగినా పత్తా లేకపోవటం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.

## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు

### పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు

### మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్య



కర్నూలు,జూన్13: ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్యానించారు. ఈ పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈరోజు(శనివారం) మంత్రి భరత్ కర్నూల్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 19 కంపెనీల్లో 1460 ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. ఒక్కరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహిస్తామని మంత్రి భరత్ వివరించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు సృష్టించేందుకు కష్టపడుతున్నామని చెప్పుకొచ్చారు. ఓర్వకల్లుకు గతంలో ఎప్పుడు లేనంతగా కంపెనీలను తీసుకువస్తున్నామని తెలిపారు. రిలయన్స్, అగస్త్య కంపెనీలను కర్నూలుకు తీసుకువచ్చామని ప్రస్తావించారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడిని పెడుతోందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు అమలైతే ప్రపంచంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంటుందని ఉద్ఘాటించారు. ఇప్పటికే దేశంలోకి వచ్చే 25 శాతం పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని మంత్రి భరత్ పేర్కొన్నారు.

## యాంటీ డ్రగ్ 3కే రన్ కరపత్రాన్ని ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల,జూన్13: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26 న నిర్వహించనున్న 'యాంటీ డ్రగ్ 3కే రన్' కరపత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ జగిత్యాల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రన్ స్ట్రాంగ్ లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో నిర్వహించనున్న ఈ 3కే రన్ పాత బస్టాండ్ దగ్గర లోని శ్రీ వివేకానంద మినీ స్టేడియం నుండి ఐఎంఏ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు..డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని వారు పిలుపునిచ్చింది. ఈ యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ బండెల విజయ్ , డాక్టర్ ఇనుగురతి రాజశేఖర్ పాల్గొన్నారు.

## మహిళ ఆర్థికంగా బలపడితేనే కుటుంబం బలపడుతుంది

### మహిళల సాధికారతకు ఆర్థిక స్వావలంబననే బలమైన పునాది.

### ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ,జూన్13: మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని కుటుంబం బలపడితేనే సామాజం అభివృద్ధి చెందుతుందని ఆర్థిక స్వాతంత్యంర మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. గొల్లపూడిలోని రైజ్ సెంటర్‌లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు వివిధ రకాల పండ్లు, కూరగాయలను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వ చేసి పౌడర్ రూపంలో ప్రాసెస్ చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. మహిళలు ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణలు మహిళలలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు సోలార్ డ్రైయింగ్ పక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై మహిళలకు వివరించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి. నాంచారరావు, అగ్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి పవన్‌కుమార్, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, రైజ్ సెంటర్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం

### విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ. 58.94 లక్షల లూటీ

సంగారెడ్డి,జూన్13 పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి మోహన్ రెడ్డి.. సైబర్ నేరగాళ్ల చేతిలో భారీ మోసానికి గురయ్యారు. మనీలాండరింగ్ కేసు పేరుతో భయపెట్టి ఆయన నుంచి మొత్తం రూ. 58.94 లక్షలను దశలవారీగా వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి.. ప్రవీణ్ కుమార్, రాజేష్ మిశ్రా అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేశారు. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్‌కు సంబంధించిన రూ. 538 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆధార్ వివరాలు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ మోహన్ రెడ్డిని బెదిరించారు. ఈ కేసులో మీ పేరుతో కూడా లావాదేవీలు జరిగాయని, దాదాపు రూ. 2 కోట్ల ట్రాన్సాక్షన్లు, వాటిపై కమిషన్ తీసుకున్నారని చెప్పి ఆయనను భయభ్రాంతులకు గురిచేశారు. 'మీపై కేసు నమోదైంది, అరెస్ట్ చేయాల్సి ఉంటుంది' అంటూ ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన మోహన్ రెడ్డి, దశలవారీగా పలు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ. 58.94 లక్షలు బదిలీ చేశారు. అనంతరం ఇది మోసమని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మద్యంలో వేల కోట్ల కుంభకోణం

### అడ్డంగా దొరికిన జగన్ అండ్ కో

### అభివృద్దిని అడ్డుకుంటూ డైవర్షన్ పాలిటిక్స్

### తీవ్రంగా విమర్శలు గుప్పించిన మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి,జూన్13: మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ వేల కోట్ల స్కామ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం అని అన్నారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం కేసు తాడేపల్లి ప్యాలెస్ గేటును తాకిందని మంత్రి ఆరోపించారు. గొడ్డలి పార్టీ నుంచి రోజుకో కుంభకోణం వెలుగులోకి వస్తోంది. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆ పార్టీ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ శాశ్వతంగా కనుమరుగు కానుందని వ్యాఖ్యానించారు. మద్య నిషేధ హామీని తుంగలో తొక్కి, కల్తీ మద్యంతో 30 వేల మంది ప్రాణాలను గొడ్డలి పార్టీ బలితీసుకుందని ధ్వజమెత్తారు. శనివారం అమరావతి వేదికగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. బాబాయి హంతకులను కాపాడుతూ, న్యాయం కోరిన సొంత చెల్లికే జగన్ వెన్నుపోటు పొడిచారని ఆగ్రహించారు. విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి, ప్రజలపై రూ. 32 వేల కోట్ల మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ హామీలను అటకెక్కించి ఐదేళ్లలో 4,100 మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యారని విమర్శించారు. జీఓ నంబర్ – 117 తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రభుత్వ స్కూళ్లను మూసివేసి, 12 లక్షల మంది భవితను అంధకారం చేశారని దుయ్యబట్టారు. బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34శాతం నుంచి 24శాతానికి కుదించి వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని ఆగ్రహించారు. 2024 ఎన్నికల్లో 94 శాతం స్థానాలతో కూటమికి చరిత్రాత్మక విజయం అందించి.. జగన్ అరాచక పాలనకు ఏపీ ప్రజలు స్వస్తి పలికారని ప్రస్తావించారు. గత ఐదేళ్ల విధ్వంసాన్ని తుడిచేస్తూ.. రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో అద్భుతమైన సంక్షేమం, ప్రగతి పథంలో ప్రయాణిస్తోందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వ సానుకూల విధానాల వల్ల, రెండేళ్లలో దేశానికి వచ్చిన మొత్తం విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే దక్కాయని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 65 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. రెండేళ్లలో తమ ప్రభుత్వంలో రూ. 65 వేల కోట్లని నేరుగా పేదలకు పంపిణీ చేశామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వ తొలి సంతకంతో మెగా డీఎస్సీ ÷లుపై ఆమోదం పొందిన తర్వాత.. 16,430 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం (స్త్రీ శక్తి) ద్వారా ఇప్పటివరకు 71 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని వెల్లడించారు. దీపం-2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ.. ఇప్పటివరకు 4.26 కోట్ల సిలిండర్లను విజయవంతంగా అందజేశామని అన్నారు. 24 నెలల స్వల్ప వ్యవధిలోనే రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వివరించారు. 21 లక్షల ఉద్యోగాల కల్పనకు పక్కా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. జగన్ హయాంలో 85శాతం హామీలను తుంగలో తొక్కితే.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 90శాతం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిందని ఉద్ఘాటించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీ అభివృద్ధిని గొడ్డలి పార్టీ అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. గొడ్డలిపార్టీ దొంగనాటకాలు ఆడుతూ మరొకసారి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,జూన్ 13,(విజన్ ఆంధ్ర); జిల్లాలో శనివారం నిర్వహించిన పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సమావేశమై జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

# పేదల ఆరోగ్యానికి అండగా..

**- నిమ్స్ వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఎల్వోసీ అందజేత...**



నిజామాబాద్ జూన్13:( విజన్ ఆంధ్ర ) పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని, అవసరమైన వారికి నిమ్స్ లో ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎల్వోసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని గౌతం నగర్ కు చెందిన హేమగ్న మూత్ర పిండాల వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రూ. 2.40 లక్షల ఎల్వోసీ అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రోగికి తక్షణ సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏజెన్సీ జర్నలిస్టుల సమస్యలు ఎట్టకేలకు పరిష్కారం..!!

**- అదిలాబాద్ కలెక్టర్ రాజార్షి షా ప్రత్యేక చొరవ..**

**- జర్నలిస్టుల తరఫున..టి.యు. డబ్ల్యూ. జే ( హెచ్ -143 ) ప్రత్యేక కృతజ్ఞతలు..!**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13, (విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల ఇబ్బందులు, వారి సమస్యలపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా ప్రత్యేక చొరవ చూపి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడియేషన్లు ఇప్పించడం పట్ల టియుడబ్ల్యూజే (హెచ్– 143) ఆదిలాబాద్ జిల్లా యూనిట్ హర్షం వ్యక్తం చేసింది. తొలి విడత జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అర్హత కలిగిన జర్నలిస్టు మిత్రులకు 206 అక్రిడేషన్లు మంజూరు కాగా, రెండో విడత మీటింగ్ లోను పనిచేసే జర్నలిస్టులను గుర్తించి 150 పైగా అక్రిడేషన్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ రాజార్షి షా ని యూనియన్ తరపున సన్మానించడం జరిగింది. అదేవిధంగా ఉట్నూర్ ఐటీడీఏ కేంద్రంగా పనిచేసే జర్నలిస్టులకు కొత్త జీవోలో అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యను యూనియన్ తరపున జిల్లా కలెక్టర్ కి విన్నవించగా, సానుకూలంగా స్పందించి ఐ అండ్ పిఆర్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఉట్నూర్, భద్రాచలం, ములుగు ఐటీడీఏ డివిజన్ కేంద్రాల్లో పని చేసే జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ ఇవ్వాలని రాష్ట్ర కమిటీ అల్లం నారాయణ , ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ , యూనియన్ నేతలు కమిషనర్ ను స్వయంగా కలిసి సమస్యను విన్నవించారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి జీవోలో సవరణ చేసి ఐటిడిఏ లో పనిచేసే వారందరికీ అక్రిడేషన్లు మంజూరయ్యాయి. ప్రత్యేక చొరవ చూపిన జర్నలిస్టుల పక్షపాతి కలెక్టర్ రాజార్షి షా కి యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపి సన్మానించడం జరిగింది. త్వరలో జరిగే 3 వ విడత సమావేశంలోనూ అర్హులైన వారందరికీ అక్రిడేషన్లు ఇవ్వడానికి కలెక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. అక్రిడేషన్ల విషయంలో పూర్తిగా సహకరించిన డిపిఆర్ఓ విష్ణువర్ధన్ గారికి కూడా యూనియన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

# మహారాష్ట్ర సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

**- గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు నార్కోటిక్ జాగిలం రోమాతో ప్రత్యేక తనిఖీలు**

**- పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మహారాష్ట్ర సరిహద్దులోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర రాష్ట్రం నుండి తెలంగాణలోకి ప్రవేశించే ప్రైవేట్ వాహనాలు, బస్సులు, కార్లు మరియు ఇతర అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో నార్కోటిక్ జాగిలం రోమా తన ప్రత్యేక ఘ్రాణశక్తితో వాహనాలను పరిశీలిస్తూ కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, నిల్వ, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలు, ఈగల్ టీం మరియు నార్కోటిక్ జాగిలాల సహాయంతో నిరంతర తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ జి శ్రావణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోదీ గారి 12ఏళ్ళ పాలనా దేశ చరిత్రలో స్వర్ణధ్యాయణం



నిర్మల్ జిల్లా,జూన్ 13,(విజన్ ఆంధ్ర); గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రధానిగా 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని కడంలో నిర్వహించిన జిల్లా ప్రతినిధుల సమ్మేళనం జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేయెల్పినేత మహేశ్వర్ రెడ్డి గారు, ముధోల్ ఎమ్మెల్యే రామ రావు పటేల్ గారు పాల్గొని ప్రసంగించాను. మోదీ గారి సమర్థవంతమైన నాయకత్వంలో మన దేశం అనేక రంగాల్లో ఎలా ముందుకు దూసుకెళ్తోందో వివరించడం జరిగింది. అభివృద్ధి, సంక్షేమం, సుశాసనమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

**- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**- హౌసింగ్ పథకంలో అక్రమాలపై విచారణ**

**- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి.. బొల్లవరం హౌసింగ్ లేఅవుట్ పరిశీలన, లబ్ధిదారులతో ముఖాముఖి**



ప్రొద్దుటూరు,జూన్ 12 (విజన్ ఆంధ్ర)పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ పథకం అమలులో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి అర్హులందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గురువారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం హౌసింగ్ లేఅవుట్‌ను ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డితో కలిసి సందర్శించిన మంత్రి అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "పేదలకు సొంత ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు.వారి జీవితానికి భద్రత, గౌరవం అన్నారు. ప్రొద్దుటూరులో ఒక్క అర్హుడూ ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే మా సంకల్పం" అన్నారు. గతంలో హౌసింగ్ పథకం అమలులో అనేక అవకతవకలు జరిగాయని, లబ్ధిదారుల ఎంపిక, ప్లాట్ల కేటాయింపు, గృహ నిర్మాణాల నిర్వహణలో అక్రమాలు చోటుచేసు కున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా మెప్మా మహిళా సంఘాలకు సంబంధించిన నిధుల వినియోగంలో సుమారు రూ.48 కోట్ల మేర గోల్‌మాల్ జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, వాటిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పేదల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేసిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు."పేదల కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సరైన లబ్ధిదారునికే చేరాలి. గతంలో ఎక్కడైనా అన్యాయం జరిగి ఉంటే దాన్ని సరిదిద్దడం మా బాధ్యత. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి పేర్కొన్నారు.ప్రొద్దుటూరు నియోజకవర్గంలో హౌసింగ్ కార్యక్రమం పురోగతిని వివరిస్తూ, రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్లలో మొత్తం 4,82,481 సెంట్ల విస్తీర్ణంలో 23,068 ప్లాట్లు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే 19,924 ప్లాట్లు లబ్ధిదారులకు కేటాయించగా, మిగిలిన 3,144 ప్లాట్లను కూడా త్వరలో అర్హులైన పేదలకు అందజేస్తామని చెప్పారు.అలాగే నియోజకవర్గంలో ఇప్పటివరకు 15,043 ఇళ్లకు అనుమతులు మంజూరు చేశామని, అందులో పట్టణ ప్రాంతాల్లో 11,655 ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3,388 ఇళ్లు ఉన్నాయని వెల్లడించారు. రామేశ్వరం లేఅవుట్‌లో 7,647 ప్లాట్లలో 6,712, బొల్లవరం లేఅవుట్‌లో 10,462 ప్లాట్లలో 9,373, మీనాపురం లేఅవుట్‌లో 4,959 ప్లాట్లలో 3,839 ప్లాట్లు ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. బొల్లవరం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లను అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్న మంత్రి, ఇప్పటివరకు సుమారు 4.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో 4 లక్షల ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలు అందజేస్తామని వెల్లడించారు."ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు సొంత ఇల్లు అత్యంత అవసరం.పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. ఇంటి స్థలం నుంచి గృహ నిర్మాణం వరకు అన్ని దశల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని గృహరహిత కుటుంబాలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఒక్క అర్హుడూ ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే మా సంకల్పం" అన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో హౌసింగ్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి మంత్రి పార్థసారథి ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ పథకం అమలులో అనేక లోపాలు, అక్రమాలు చోటుచేసు కోవడంతో వేలాది మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించకపోవడం, నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడం, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయని చెప్పారు. బొల్లవరం హౌసింగ్ లేఅవుట్‌లో అనేక ఇళ్లు అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయిన గృహ నిర్మాణాలను తిరిగి గాడిలో పెట్టేందుకు చర్యలు ప్రారంభించిందన్నారు. నిర్మాణాలు పూర్తిచేసే లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. హౌసింగ్ పథకానికి సంబంధించిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మెప్మా మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, విచారణలో వాస్తవాలు బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు మరింత అప్రమత్తతో వ్యవహరించాలి

**- ఏపీకే ఫైల్స్, తెలియని లింక్స్ పట్ల జాగ్రత్త**

**- సోషల్ మీడియా ప్రకటనలతో మోసాలు జరిగే ఆస్కారం ఎక్కువ.**

**- లోన్ ఫ్రాడ్, ఏపీకే ఫ్రాడ్, ఫేక్ లింక్, బిజినెస్ ఫ్రాడ్, వర్క్‌ఫ్రం హోం జాబ్స్ ఫ్రాడ్, హనీ ట్రాప్ ఫై లాంటివి దేశంలో జరుగుతున్న సైబర్ మోసాలు.**

**- ఈవారం జిల్లాలో 18 సైబర్ క్రైమ్ ఫిర్యాదుల నమోదు.**

**- సైబర్ క్రైమ్ గురైతే 1930 హెల్ప్ లైన్ కు సంప్రదించాలి.**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13, (విజన్ ఆంధ్ర ) సైబర్ నేరాలలో అప్రమత్తులతో వ్యవహరించి మోసపోకుండా ఉండాలని జిల్లా ప్రజలకు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు అనేక రకాల పద్ధతులను ఉపయోగిస్తూ అమాయకులను మోసం చేస్తూ ఉంటారని వారి తో జాగ్రత్తగా వ్యవహరించి మోసపోకుండా ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఖాకీ కిడ్స్ పేరుతో సిబ్బంది గ్రామాలను పాఠశాలలను కళాశాలలను సందర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అందులో ముఖ్యంగా ఏపీకె ఫైల్స్, తెలియని లింక్స్ ను వాట్సప్ లో గానీ, టెలిగ్రామ్ లో కానీ వినియోగించడం ద్వారా మొబైల్ ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లి తమ అకౌంట్లు ఖాళీ చేసే ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి అని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ ఆఫర్స్ పేరుతో, వర్క్ ఫ్రొం హోం ఆఫర్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు తక్కువ మొత్తంలో నగదు చెల్లించాలి అంటూ వివిధ దఫాలుగా ప్రజలను మోసం చేస్తూ ఉంటారని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల ఆచితూచి వ్యవహరించాలని ప్రతి ఒక్క వ్యాపార ప్రకటన నమ్మశక్యంగా ఉండదని సూచించారు. ఈవారం జిల్లా వ్యాప్తంగా 19 ఫిర్యాదులు సైబర్ క్రైమ్ విభాగంలో నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930 లేదా జాతీయ సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయాలి. ముఖ్యంగా ఆర్థిక నేరాలలో గంటలోపు ఫిర్యాదు చేసిన ఎడల పోయిన డబ్బు తిరిగి వచ్చే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఎలాంటి సైబర్ క్రైమ్ ఫిర్యాదులైన వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో సైబర్ వారియర్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

## జిల్లా వ్యాప్తంగా నమోదైన పలు సైబర్ క్రైమ్ వివరాలు.

ఆదిలాబాద్ పట్టణంలోని ఒక మహిళకు నిత్య బుక్స్ పేరుతో వర్క్ ఫ్రొం హోమ్ అంటూ మహిళ వద్ద నుండి విడతలవారీగా 20,000 రూపాయలను సైబర్ నేరగాళ్లు తస్కరించారు. తెలియని నెంబర్ నుండి ఒక ఫోన్ వచ్చి వాట్సాప్ లో పంపిన లింకును వినియోగించడం ద్వారా ఆదిలాబాద్ పట్టణంలోని ఒక వ్యక్తి మొబైల్ ఫోన్ నుండి 40 వేల రూపాయలను సైబర్ నేరగాళ్లు తస్కరించారు. పట్టణంలోని ఒక వ్యక్తికి టెలిగ్రామ్ ద్వారా బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ చేస్తే రెట్టింపు నగదు అంటూ ఎనిమిది వేల రూపాయలను సైబర్ నేరగాళ్లు తీసుకొని మోసం చేయడం జరిగింది. తెలియని ఏపీకే ఫైల్ ను వాట్సాప్ ద్వారా ఫోన్లో ఇన్స్టాల్ చేయడం వల్ల భీంపూర్ మండలంలోని ఒక వ్యక్తి అకౌంట్ నుండి లక్ష రూపాయలను మోసపోవడం జరిగింది. ఉట్నూర్ పట్టణంలోని ఒక యువకునికి హ్యాపెన్ డేటింగ్ అనే వెబ్సైట్ ద్వారా ఒక మహిళ హనీ ట్రాప్ చేసి 1,40,000 రూపాయలు మోసం చేయడం జరిగింది.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

**- రిమ్మ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం**

**- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం..**

**- లైబ్రరీకి రూ.10 లక్షల మంజూరు**

**- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు**



నిర్మల్ జిల్లా,జూన్ 13,(విజన్ ఆంధ్ర); ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలో గల సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో పర్యటించిన ఆయన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులు నైతం కవిత–సోము, తొడసం సుదర్శన్–మధుబాయి, సీతాబాయి–దేవురావు కుటుంబాలకు చెందిన నూతన గృహాలను మంత్రి పరిశీలించి, ప్రభుత్వ సహాయంతో సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లిమంత్రిలి మాట్లాడుతూ, రిమ్మ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటి వరకు 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హులైన కుటుంబాలకు అదనపు గృహాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**విద్యాభివృద్ధికి ప్రాధాన్యం**

గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.

**మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్**

ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చిట్టచివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 1.43 కోట్లతో నిర్మించిన మావల పిహెచ్సి భవనం ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా మావల మండల పరిధిలోని బట్టిసావర్గాం గ్రామంలో రూ. 1.43 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని శనివారం ఆదిలాబాదు పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, స్థానిక శాసన సభ్యులు పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా లతో కలిసి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాధన, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య శాఖ సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలి


**- బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్**



నిర్మల్ జిల్లా,జూన్ 13,(విజన్ ఆంధ్ర); నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం మండలం కొండుకూరు గ్రామంలోని వాఖ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన SIR అవగాహన సదస్సులో రితేష్ రాథోడ్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టనున్న SIR కార్యక్రమంలో BLA–2లు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలోని ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని అన్నారు.అలాగే ఓటరు జాబితాల్లో ఉన్న నకిలీ ఓట్లు, ద్వంద్వ నమోదులు, మరణించిన వారి పేర్లు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో BLA–2లు కీలక బాధ్యత వహించాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత ప్రాముఖ్యత కలిగినదని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా ఉండాలంటే ప్రతి దీూా–2 సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీ తరపున నియమించబడిన BLA–2లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ నూకల విజయ్ కుమార్,, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉపాధ్యక్షులు నారి వినోదకుమార్, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లా రవీందర్ రెడ్డి, ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్ గారు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, BLA–2లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే మోడీ పాలన ఉత్తమం

**- ఎంపీ గోడం నగేష్ , ఎమ్మెల్యే పాయల్ శంకర్**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13, (విజన్ ఆంధ్ర) గత 12 సంవత్సరాలుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి, సుశాసనం మరియు పేదల సంక్షేమంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. ఆదిలాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తపురే ఇతర నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మోదీ నాయకత్వంలో దేశం ప్రతి రంగంలో అభివృద్ధి చెందుతోందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు.

# హైదరాబాద్ లోని 'నిసా' లో దీక్షాంత్ పరేడ్‌ను సమీక్షించిన తెలంగాణ గవర్నర్

హైదరాబాద్ జూన్ 2026 సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) యొక్క నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నిసా) హైదరాబాద్‌లోని హకీంపేట్‌లోని తన క్యాంపస్‌లో 39వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండెంట్లు, 19వ బ్యాచ్ సబ్-ఇన్‌స్పెక్టర్ల (మాజీ సైనికులు) పాసింగ్ అవుట్ పరేడ్‌ను నిర్వహించింది, దీని ద్వారా 200 మంది శిక్షణ పొందిన అధికారులు అధికారికంగా దళంలోకి చేరారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్‌తో పాటు సీఐఎస్ఎఫ్ ఇతర సీనియర్ అధికారులు, రాష్ట్ర పౌర, పోలీసు ప్రముఖులు హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న 200 మంది అధికారులలో, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యు పి ఎస్ సి ) సి ఎ పి ఎఫ్ (ఏసీ ) పరీక్ష ద్వారా ఎంపికైన 76 మంది అసిస్టెంట్ కమాండెంట్లు వీరిలో 5 మంది మహిళా అధికారులు ఉన్నారు, 124 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు మాజీ సైనికులు ఒక ప్రత్యేక వృత్తిపరమైన అభివృద్ధి కోర్సును పూర్తి చేశారు. పరేడ్ కమాండర్ అసిస్టెంట్ కమాండెంట్ మనీష్ కుమార్



రాయ్ పరేడ్ 2-1/సి ఏసీ సుశిరి రోష్ని దేవి నేతృత్వంలో జరిగిన దీక్షాంత్ పరేడ్‌లో, కవాతు బృందాలు అద్భుతమైన డ్రిల్, క్రమశిక్షణను ప్రదర్శించాయి. ఏసీ సుమిత్ లత్వాల్ ఆల్ రౌండ్ బెస్ట్‌గా ఎంపికై, ప్రతిష్ఠాత్మకమైన 'స్వోర్డ్ ఆఫ్ ఆనర్' ను అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, నేటి పరేడ్ క్రమశిక్షణ, అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యానికి స్ఫూర్తిదాయకమైన ప్రదర్శన అన్నారు. సీఐఎస్ఎఫ్ భారతదేశ భద్రతా వ్యవస్థకు బలమైన, నమ్మకమైన స్తంభంగా దేశ ఆర్థిక వ్యవస్థకు సంరక్షకుడిగా మారిందన్నారు.

# ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి.

**- టీపీయూఎస్ ములుగు**
**జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి.**

ములుగు జూన్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : 20 ఏళ్లుగా విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పేరుతో రోడ్డున పడేయొద్దని, ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ములుగు జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ములుగులో విలేకరులతో మాట్లాడిన ఆమె, ఎన్‌సీటీఈ నిబంధనలకు అనుగుణంగా సెప్టెంబర్ 1, 2025న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 2028 ఆగస్టు 31లోపు ఇన్‌సర్వీస్ టీచర్లు టెట్ పాస్ కాకపోతే సర్వీస్ నుంచి తొలగించే అవకాశం ఉంది. తెలంగాణలోనే సుమారు 30,000 మంది ఉపాధ్యాయుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది అని జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1, 2010న అమల్లోకి వచ్చిన విద్యా హక్కు చట్టంలో 2010కు ముందు న్యాయబద్ధంగా నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని స్పష్టంగా పేర్కొన్నారని గుర్తుచేశారు. ఆ తర్వాత జరిగిన డీఎస్సీల్లోనే టెట్ అర్హత తప్పనిసరి చేశారన్నారు. ఆర్టీఈ రూల్స్‌కు అనుగుణంగా ఎన్‌సీటీఈ టెట్ నిబంధనలు తీసుకురావడం, దాని ఆధారంగానే ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు రావడం దురదృష్టకరమన్నారు. 20-25 ఏళ్లుగా పాఠశాలల్లో సేవలందిస్తూ, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయమనడం అన్యాయం. వయసు పైబడిన వారు, మహిళా ఉపాధ్యాయులు టెట్‌కు ప్రిపేర్



కావడం చాలా కష్టం. ఇది మానసిక వేదనకు గురి చేస్తోంది అని జ్యోతి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై 65 రివ్యూ పిటిషన్లు వేసినా నిబంధనల కారణంగా కొట్టివేశారని, దీంతో ఉపాధ్యాయులకు న్యాయపరంగా మార్గం మూసుకుపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 2 సార్లు టెట్ నిర్వహిస్తామని చెప్పడం తాత్కాలిక ఊరట మాత్రమేనని, శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు.

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ : "2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయుల సేవలను, అనుభవాన్ని గుర్తించాలి. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువచ్చి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. లేకుంటే 30 వేల కుటుంబాలు రోడ్డున పడతాయి" అని వాంకుడోత్ జ్యోతి డిమాండ్ చేశారు. ఈ సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

30 వేల మంది ఉపాధ్యాయుల్లో టెన్షన్ : సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణలో 2010కు ముందు నియమితులైన దాదాపు 30,000 మంది ఉపాధ్యాయులు 2028 ఆగస్టు 31లోపు టెట్ పాస్ కావాల్సి ఉంది. లేకుంటే ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉండటంతో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

# రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం !

**- టిడిపి సీనియర్ నేత డా., కొంకుల రాంబాబు**

బద్వేలు, జూన్ 12 (విజన్ ఆంధ్ర)రాష్ట్రంలో ప్రభుత్వం రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం తమ నమ్మకాన్ని నిలబెట్టుకుందని బద్వేల్ టిడిపి సీనియర్ నాయకులు మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు డాక్టర్ కొంకుల రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి నారా లోకేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భారతీయ జనతా పార్టీ సారధ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రం కోసం అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిని సాధిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజల ఆర్థిక ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా వారి యొక్క అభివృద్ధికి కృషి చేసిందన్నారు. పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, విద్యార్థులకు, నిరుద్యోగ యువత కోసం ఉద్యోగ అవకాశాలు, పేదల కోసం అన్న క్యాంటీన్లు, మహిళాభివృద్ధి కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలు, రైతులకు, మత్స్యకారులకు, చేనేత కార్మికులకు, పేదలకు సొంత గృహాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు చేపట్టి వారి



కుటుంబాలలో వెలుగును నింపిన చరిత్ర కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మరియు రాష్ట్ర నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.


**డీఎస్సీ పై వైసీపీ నాయకుల తీరు హాస్యాస్పదం**

వైసిపి పార్టీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకులు డిఎస్సి పై నిన్నటి దినం చేసిన ర్యాలీ హాస్యాస్పదంగా ఉన్నదని బద్వేలు మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు కొంకుల రాంబాబు తీవ్రంగా స్పందించారు గడచిన వైసిపి ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండ నిరుద్యోగులతో ఆటలాడుకున్న వైసిపి ప్రభుత్వం నేడు కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ ఆందోళనలు చేపట్టడం సరి కాదన్నారు

# కాకతీయ పాఠశాలను సీజ్ చేసి విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**- ఐక్య విద్యార్థి సంఘాలు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 13,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని గద్దరగడి ప్రాంతం లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన కాకతీయ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు యాజమాన్యం బిల్డింగ్ లీజు అగ్రిమెంటు లేకుండానే ఇతర శాఖల నుంచి అనుమతులు తీసుకొని ఆయా శాఖల అధికారులను తప్పు తోవ పట్టించారన్నారు. పాఠశాలకు సంబంధించి బిల్లింగ్ లీజు అగ్రిమెంటు లేకుండానే ఎన్ ఓసి సర్టిఫికెట్లు జారీ చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఆయా శాఖల అధికారులకు కాకతీయ పాఠశాల అనుమతుల విషయంలో అధికారులకు పెద్ద మొత్తంలో తాయిలాలు ముట్టినట్లు ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ అనుమతులు ఏవి కూడా క్షుణ్ణంగా పరిశీలించకుండానే పాఠశాలకు ఓపి పర్మిషన్లు ఇవ్వడం ఏంటని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు.



ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, విద్యాశాఖను తప్పుదోవ పట్టించిన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలనలో బాధ్యులైన మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకొని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలంగాణ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ, తెలంగాణ విద్యార్థి సమైక్య మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రేగుంట క్రాంతి కుమార్, నేషనల్ స్టూడెంట్ కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బచ్చలి అభిరామ్, మరియు విద్యార్థి సంఘాల నాయకులు హర్షిత్, కార్తీక్, విష్ణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలు, విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**
**- అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలి**
**- విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించాలి**
**- వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు**
**- మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి**

నిజామాబాద్, జూన్ 13 : (విజన్ ఆంధ్ర )జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు



ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ, వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చూడాలన్నారు. బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే, ఈ నెల 20వ తేదీ లోపు వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విద్యా సంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రభుత్వ విద్యా సంస్థలలో పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, నిర్వహణాపరమైన లోపాలు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఎస్.సీ.డీ.ఓ రజిత, జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, ఆర్.సీ.ఓ కు, సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, స్పెషలాఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన 'పేరిణి' నాట్య ప్రదర్శన , "దుబ్బుల కొలువు" జానపద కలరూపం

హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్ ) : తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలలో 72 వ రోజు నిర్వహించిన పేరిణి నాట్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గురువారంనాడు రవీంద్ర భారతి "పాల్కురికి సోమన్న మూల" వేదికపై ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత పేరిణి రాజ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన పేరిణి నాట్య ప్రదర్శన సభికులను మంత్రముగ్ధులను చేసింది. వేసవి సెలవుల సంధర్భంగా పేరిణి రాజ్‌కుమార్ నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు



అత్యంత నైపుణ్యంతో, ఉత్సాహంతో కాకతీయుల వైభవాన్ని ప్రతిబింబించే పేరిణి శివతాండవ నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. వీర నాట్యానికి ప్రతీకగా నిలిచిన పేరిణి నృత్యంలో చిన్నారులు ఎంతో లయాత్మకంగా , చక్కటి హావభావాలు, శక్తివంతమైన అడుగులు నాట్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ, పిల్లలు సెలవు రోజుల్లో ఫోన్లకు , టెలివిజన్‌లకే పరిమితం కాకుండా మన చారిత్రక కళారూపాలను నేర్చుకోవడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కాకతీయుల కాలం నాటి ఈ అపురూపమైన, అద్భుతమైన పేరిణి నృత్యాన్ని భావితరాలకు అందించేందుకు ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలు ఎంతో అవసరమని అన్నారు. అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థులకు, శిక్షణ అందించిన గురువులు కస్తూరి, చందన ప్రమద పేరిణి రాజ్‌కుమార్ టీమ్ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఏనుగు నరసింహారెడ్డి కళాకారులను ఘనంగా సత్కరించి, ప్రశంశా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్. విజయ్ కుమార్, ముచ్చెర్ల దినకర్, పల్లె నర్సింహ, ఒగ్గు రవి, విద్యానంద చారి, ఎ. రవి కుమార్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద గీతాలు, సామాజిక చైతన్య గీతాలతో ప్రేక్షకులలో ఉత్సాహాన్ని నింపి సభా వాతావరణాన్ని మరింత కళాత్మకంగా మార్చారు. శుక్రవారంనాడు నిర్వహించిన కార్యక్రమంలోతెలంగాణ జానపద కళాసంపదకు ప్రతీకగా నిలిచిన "దుబ్బుల కొలువు" ప్రదర్శన 73వ రోజు కార్యక్రమంలో భాగంగా "పాల్కురికి సోమన్న మూల" వేదికపై అత్యంత అద్భుతంగా కలకారులు ఆవిష్కరించి ప్రేక్షకులను విశేషంగా అలరించారు. కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల నుండి విచ్చేసిన ఈ "దుబ్బుల కొలువు" కళాకారులు బోయిరి శ్రీకాంత్, జునగరి గణేష్, బోయిరి సంపత్, లక్ష్మన్, రవీందర్, శేఖర్ తదితరులు తమ అద్భుతమైన అభినయం, సాంప్రదాయిక ప్రదర్శనతో దుబ్బుల కొలువు జానపద కళారూపాన్ని ఆవిష్కరించి ప్రేక్షకుల ప్రశంశలను అందుకున్నారు. ఈ ప్రదర్శన తెలంగాణ గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టడమే కాకుండా, దుర్గమ్మ కొలుపు, మన పూర్వీకుల జీవన విధానం ఈ కళారూపంలో కలకారులు సజీవంగా ప్రతిబింపజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి స్పందిస్తూ, అంతరించిపోతున్న జానపద కళలను, కళాకారులను పరిరక్షించడం, వాటిని అన్నివిధాలా ప్రోత్సహించడం సాంస్కృతిక శాఖ ప్రధాన బాధ్యతగా భావిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి అరుదైన కళారూపాలను ముందు తరాలకు నేర్పిస్తే, ఆ నేర్పిచడానికి అయ్యే ఖర్చును సాంస్కృతిక శాఖ పూర్తిగా భరిస్తుందని తెలిపారు. అనంతరం ఏనుగు నరసింహారెడ్డి కళాకారులను ఘనంగా సత్కరించి, వారి ప్రతిభను కొనియాడారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద గీతాలు, సామాజిక చైతన్య గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి రేలారే ప్రసాద్, విద్యనందాచారి చారి, శ్రీనివాస్ రాజు వ్యాఖ్యాతలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని మరింత రసవత్తరంగా తీర్చిదిద్దారు.


# అభివృద్ధిని అడ్డుకోవాలా, లేక భవిష్యత్తును ఆహ్వానించాలా.?

## ఊహలు ఎవరివి, వాస్తవాలు ఎవరివి ?

గద్వాల జూన్ 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లా కోర్టు సముదాయం అనంతపురం గుట్టల వద్ద నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందులు వస్తాయని కొందరు చెబుతున్నారు. కానీ ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని నేటి పరిస్థితులతో మాత్రమే కొలిస్తే దేశంలో ఏ నగరం, ఏ సంస్థ, ఏ మౌలిక సదుపాయం కూడా ఏర్పడేది కాదు.

**వాస్తవాలను చూద్దాం...**

ఒకప్పుడు గద్వాల పట్టణం సుంకులమ్మ గుడి పరిసరాల్లోనే ఉండేది. నేడు హౌసింగ్ బోర్డ్, కొత్త కాలనీలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు పట్టణ విస్తరణకు నిదర్శనం.76 సంవత్సరాల్లో రెండున్నర కిలోమీటర్లు మాత్రమే విస్తరించింది అనే వాదన పూర్తిగా తప్పుదారి పట్టించేదే. పట్టణాభివృద్ధి సరళ రేఖలో జరగదు. ఒక పెద్ద ప్రభుత్వ ప్రాజెక్టు, రింగ్ రోడ్డు, విద్యాసంస్థ, పరిశ్రమ, కోర్టు సముదాయం వంటి ప్రాజెక్టులు అభివృద్ధిని వేగవంతం చేస్తాయి.ఒకప్పుడు పట్టణానికి దూరంగా ఉన్న కలెక్టరేట్‌లు, యూనివర్సిటీలు, మెడికల్ కాలేజీలు, హైకోర్టులు నేడు నగరాల మధ్యలోనే ఉన్నాయి.భవిష్యత్ 50 నుండి 100 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిస్తాయి. కేవలం నేటి




ట్రాఫిక్ లేదా నేటి జనాభా ఆధారంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టవు.81 కోట్ల కోర్టు సముదాయం చిన్న విషయం కాదు.జిల్లా కోర్టు సముదాయం సాధారణ భవనం కాదు. ఇది శాశ్వత న్యాయ వ్యవస్థ కేంద్రం.భవిష్యత్తులో కొత్త కోర్టులు, పార్కింగ్, న్యాయవాదుల ఛాంబర్లు, లిటిగెంట్ సౌకర్యాలు, రికార్డు భవనాలు, భద్రతా వ్యవస్థలు, వసతి గృహాలు ఏర్పడాలంటే విస్తారమైన భూమి అవసరం.పట్టణ మధ్యలో అలాంటి విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందా, ఉంటే ఎందుకు ఇప్పటివరకు ఎవరూ చూపించలేకపోతున్నారు.ప్రజల సౌకర్యం అంటే కేవలం దూరమా..నేడు పట్టణంలోనే ఉన్న కోర్టులకు కూడా చాలామంది గ్రామీణ ప్రజలు 30 నుండి 60 కిలోమీటర్లు ప్రయాణించి వస్తున్నారు. అనంతపురం గుట్టల వరకు అదనంగా కొన్ని నిమిషాల ప్రయాణం ఉండవచ్చు. కానీ ప్రతిఫలంగా శాశ్వత, విశాల, ఆధునిక కోర్టు సముదాయం లభిస్తుంది.మంచి రోడ్లు, బస్సు సౌకర్యం, ఆటోలు, భవిష్యత్ రవాణా వ్యవస్థలతో ఈ సమస్యలు సులభంగా పరిష్కరించవచ్చు.

**రియల్ ఎస్టేట్ అనే ఆరోపణ ఎందుకు..**

అభివృద్ధి జరిగే ప్రతి ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ కోణంలో చూడటం సరైంది కాదు.ప్రభుత్వ స్థలంలో, ప్రభుత్వ నిధులతో, హైకోర్టు ఆమోదంతో నిర్మించే కోర్టు సముదాయాన్ని వ్యక్తిగత వ్యాపారాలతో ముడిపెట్టడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. అసలు ప్రశ్న ఇదే.81 కోట్ల రూపాయలతో భవిష్యత్ తరాలకు సరిపోయే విశాల కోర్టు సముదాయం నిర్మించాలా లేక నేటి రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాల కోసం మరోసారి ప్రాజెక్టును ఆలస్యం చేసి నిధులు కోల్పోవాలా.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని శాశ్వత పరిష్కారం అవసరం.అభివృద్ధిని అడ్డుకోవడం కాదు, అభివృద్ధిని వేగవంతం చేయడం కాలానుగుణ బాధ్యత.గుట్టలో కోర్టు కాదు అంటున్నారు. కానీ భవిష్యత్తును గుట్టల దగ్గరే ఆపేయాలా.నేటి అసౌకర్యాన్ని మాత్రమే చూసి రేపటి తరాల అవకాశాలను త్యాగం చేయకూడదు.జిల్లా కోర్టు సముదాయం నిర్మాణం వెంటనే ప్రారంభించాలి . గద్వాల జిల్లా అభివృద్ధికి ఇది చారిత్రాత్మక అడుగు.

# మంచిర్యాల నియోజకవర్గం లో మళ్ళీ గులాబీ జెండా ఎగరడం ఖాయం

**- సభ్యత్వ నమోదు పక్కాగా చేయాలి**
**- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 13,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. శనివారం వేంపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సర్ ఓటరు నమోదు ప్రక్రియ పై అవగాహన సదస్సులో మాట్లాడారు. మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ నారదాసు లక్ష్మణ్ మరియు మంచిర్యాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ కౌశిక హరి తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గం లో పార్టీ పుట్టిన నాటి నుండి నేటి వరకు ప్రతి కార్యకర్త కేసీఆర్ ఆశయసాధన కోసం పనిచేస్తున్నారన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రతి గ్రామలలో, మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి అధికంగా సభ్యత్వం నమోదు చేపించాలన్నారు.



అదేవిధంగా సర్ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యుత్సాహంతో, అధికార బలంతో బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓట్లను ఓటర్ లిస్టు నుండి తొలగించే ప్రయత్నం చేస్తారని,దాన్ని మన బీఆర్ఎస్ సైనికులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.మంచిర్యాల నియోజకవర్గం సభ్యత్వ నమోదు కార్యక్రమం పురస్కరించుకొని టిఆర్ఎస్ పార్టీ జెండాలు తోరణాలు ఫ్లెక్సీలతో అలంకరించడం జరిగిందని, వాటిని ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు మున్సిపల్ అధికారులు,పోలీసులతో తీపించడం చాలా దుర్మార్గం మన్నారు.అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గెలిచిన తర్వాత మంచిర్యాల నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా గుండాయిజం,రౌడీయిజంను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పై కొట్లడాల్సిన బాధ్యత మనపై ఉందని,ఎన్ని కేసులు పేట్టిన భయపడకుండా ఎదుర్కోవాలన్నారు.నరదాసు లక్ష్మణ్, కౌశిక్ హరి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తుందని, అందుకు ప్రతి కార్యకర్త కష్టపడి ప్రతి గ్రామంనుండి సభ్యత్వ నమోదు పెంచాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో కేసీఆర్ చేసిన పనులను ప్రజలకు వివరించలన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 97 శాతం తగ్గిన మొబైల్ డేటా చార్జీలు

హైదరాబాద్, జూన్ 14, : పెట్రోల్ ధరలు పెరిగాయని, డీజిల్ ధరలు పెరిగాయిని, గ్యాస్ ధరలు పెరిగాయని, కంరెటు చార్జీలు పెరిగాయని, బస్సు చార్జీలు పెరిగాయని వామపక్ష పార్టీలు, విపక్షాలు ఆందోళనలు చేయడం సహజం. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రో, గ్యాస్ ధరలపైనే విపక్షాలు ఎక్కువగా ఆందోళన చేశాయి. అయితే ధరలు తగ్గినప్పుడు మాత్రం ఎవరూ స్వాగతించరు. అయితే రోజురోజుకు అన్నింటి ధరలు పెరుగుతున్నాయి. కానీ 12 ఏళ్లలో అనూహ్యంగా ఒకదాని ధర 97 శాతం తగ్గింది. అందరికీ అందుబాటులోకి వచ్చింది. అందే మొబైల్ డేటా.కేంద్ర ప్రభుత్వం డిజిటల్ రంగంలో సాధించిన అపూర్వ విజయాన్ని వెల్లడించింది. 2014లో 1 గిగాబైట్(జీబీ) డేటా ధర రూ.269 ఉంటే, ప్రస్తుతం అది కేవలం రూ.9.2కి తగ్గింది. అంటే గత 4,399 రోజుల్లో (సుమారు 12 ఏళ్లలో) డేటా ధరలో 97 శాతం తగ్గుదల నమోదైంది.ఇది భారత్ డిజిటల్ చరిత్రలో ఒక మైలురాయి. ఈ అద్భుత మార్పు వెనుక కేంద్ర ప్రభుత్వం నిరంతరం చేపట్టిన డిజిటల్ ఇండియా కార్యక్రమం, భారత్‌నెట్ ప్రాజెక్ట్, ఆప్టికల్ ఫైబర్ విస్తరణ, పోటీతత్వం ప్రోత్సాహం, 2016లో రిలయన్స్ జియో ప్రవేశం వంటి అనేక అంశాలు కలిసి ఈ ధరల తగ్గుదలకు దోహదపడ్డాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించడం, స్పెక్ట్రం అలాట్‌మెంట్‌లో పారదర్శకత, 5జీ సేవల వేగవంతమైన రోల్‌అవుట్ వంటి చర్యలు డేటా సరఫరాను భారీగా పెంచి, ధరలను తగ్గించాయి.ఈ చౌక డేటా ధరల వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది సామాన్యులు, విద్యార్థులు,




రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, గ్రామీణ యువతకు అధునాతన ఇంటర్నెట్ సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. విద్యా రంగంలో ఆన్‌లైన్ క్లాసులు, డిజిటల్ లెర్నింగ్ఆరోగ్య రంగంలో టెలి మెడిసిన్ సేవలు, ఆర్థిక రంగంలో యూపీఐ, డిజిటల్ బ్యాంకింగ్, చిన్న వ్యాపారాలు ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా మార్కెట్‌ను చేరుకోవడానికి చౌక డేటా ధరలు ప్రధాన ఆధారం అయ్యాయి.ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత చౌకైన డేటా ధరలు కలిగిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. నాణ్యతతోపాటు చౌకదనం కలిపి ఇంటర్నెట్‌ను సామాన్యుని జేబులోకి తీసుకువచ్చిన దేశంగా భారత్ ప్రపంచం ముందు నిలుస్తోంది. మోదీ పాలనలో డేటా ధరల్లో వచ్చిన ఈ భారీ తగ్గుదల కోట్లాది భారతీయుల జీవన విధానాన్ని, అవకాశాలను మార్చిన నిజమైన డిజిటల్ విప్లవం. చౌకైన, నాణ్యమైన ఇంటర్నెట్ దేశంలోని చివరి వ్యక్తి వరకు అందుబాటులోకి వచ్చిన ఈ ప్రయాణం భారత్‌ను ప్రపంచ డిజిటల్ శక్తిగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

# 59 నియోజకవర్గాలు రెండు భాగాలు

**- 111 నియోజకవర్గాలు మూడు భాగాలు**

**- సౌత్ లో పెరగనున్న 170 స్థానాలు**

హైదరాబాద్, జూన్ 14, : దక్షిణది రాష్ట్రాలకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గుడ్ న్యూస్ చెప్పారు. కొంతకాలంగా కొంతమంది రాజకీయ నాయకులు దక్షిణాది మీద అడ్డగోలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కెసిఆర్ నుంచి మొదలు పెడితే రేవంత్ రెడ్డి వరకు దక్షిణాది రాష్ట్రాలను నరేంద్ర మోడీ పట్టించుకోవడంలేదని.. పార్లమెంటు స్థానాల పెంపు విషయంలో కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అయితే దీనిపై బీజేపీ సరిగా కౌంటర్ ఇవ్వలేకపోయింది. ఇప్పుడు బిజెపి తీసుకొచ్చిన ప్లాన్ ఆ తరహా నాయకుల నోర్లు మూసే విధంగా ఉంది.గతంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం తేలిపోయింది. మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపకపోవడంతో ఆ అంశంలో కేంద్ర ప్రభుత్వం విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు అంచనాలకు మించిన బలాన్ని సొంతం చేసుకున్న తర్వాత కేంద్రం మరొకసారి డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తీసుకొస్తుంది. మన దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పెంచాలని కేంద్రం భావిస్తున్నది. దీనివల్ల ప్రజలకు మరింత సమర్థవంతమైన పరిపాలన లభిస్తుందని కేంద్రం చెబుతోంది. ఇప్పటికే పార్లమెంటు స్థానాల పెంపు విషయాన్ని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది. కీలకమైన ప్రతిపాదనలను అందించిందిజనాభా పెరిగినప్పుడు ఖచ్చితంగా



నియోజకవర్గాల పునర్విభజన సాధ్యమవుతుంది. నియోజకవర్గాల పెంపునకు పెరిగిన జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుత జనాభా నివేదికలో పట్టణీకరణ.. ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని ప్రధాని ఆర్థిక సలహా మండలి సూచించింది. దీనివల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు పరిపాలన మరింత చేరువవుతుందని.. ఆ ప్రజలకు ప్రతినిధులుగా ఎంపీలు ఉంటారని ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రకటించింది..ఇక దేశంలో 543 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. కొత్త ప్రతిపాదనలను కేంద్రం అమలు చేస్తే వాటి సంఖ్య 824కు చేరుకునే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాలలో సీట్ల పెంపు ఏకంగా 50% వరకు ఉంటుంది. చిన్న రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న స్థానాలను రెట్టింపు చేస్తారని సమాచారం. దీనివల్ల ఎంపీలు ప్రజలకు మరింత చేరువగా ఉంటారని తెలుస్తోంది.. ప్రధాని ఆర్థిక మండలి నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 170 పార్లమెంట్ నియోజకవర్గాలను పునర్విభజిస్తారు. ఇందులో 59 నియోజకవర్గాలు రెండు భాగాలవుతాయి. 111 నియోజకవర్గాలు మూడు భాగాలవుతాయి. దీనివల్ల ప్రజలకు ఎంపీలు మరింత దగ్గరవుతారు. సమస్యలను నేరుగా పరిష్కరిస్తారు.నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలకు పునర్విభజనలో అదిరిపోయే కానుక ఇచ్చే అవకాశం ఉంది. కేరళ రాష్ట్రంలో ప్రస్తుతం 20 స్థానాలు ఉండగా.. అవి 30 కి పెరుగుతాయి. తమిళనాడులో 39 నుంచి 59.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కూడా స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇక మన దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంటు స్థానాలు 120కి పెరిగే అవకాశం ఉంది. అక్కడ దాదాపు 80 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి.కొత్త నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజల ప్రాతినిధ్యం మెరుగుపడుతుంది. అంతేకాదు ఓటింగ్ కూడా 2.3 శాతం వరకు పెరుగుతుంది. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా మహిళల కోసం పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2027 జనాభా లెక్కల తర్వాతనే చేపట్టాలని కమిటీ ప్రకటించింది. నియోజకవర్గాల పునర్విభజన పూర్తయితే దేశంలో రాజకీయంగా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# ఆయిల్ సంక్షోభానికి చెక్..




న్యూఢిల్లీ, జూన్ 14, : పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు.. హర్మూజ్ ఎప్పుడు తెరుచుకుంటుందో అర్థం కావడం లేదు. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. ముఖ్యంగా దిగుమతిపై ఆధారపడిన భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు యురోపియన్ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే చమురు ధరలు భారీగా పెరిగాయి. భారత్‌లో గ్యాస్, చమురు ధరలను కేంద్రం పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా దేశంలో చమురు సంక్షోభాన్ని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో అత్యవసర ఇంధన నిల్వల సామర్థ్యాన్ని 50 శాతం పెంచబోతోంది. ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉండగా, వాటిని 90 రోజుల వరకు పెంచే దిశగా అడుగులేస్తోంది. ఆయిల్ కంపెనీలను ఫ్యూయల్ కెపాసిటీని పెంచుకోవాలని ఆదేశించనున్నట్లు తెలుస్తోంది.దేశంలోని మొత్తం ఇంధన అవసరాల్లో సుమారు 90 శాతం విదేశాల నుంచి దిగుమతుల ద్వారానే తీరుతోంది. పశ్చిమాసియా ప్రాంతం నుంచి ఎక్కువగా చమురు వస్తోంది. ఆ ప్రాంతంలో ఏర్పడిన సంక్షోభం వల్ల సరఫరా చైన్ దెబ్బతిన్నది. అలాంటి పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ, రవాణా రంగం, పరిశ్రమలు దెబ్బతినకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అని ప్రభుత్వం భావిస్తోంది.ఇంధన నిల్వలను పెంచడం అనేది కేవలం నిల్వల సామర్థ్యం పెంచడం మాత్రమే కాదు. ఇది దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసే వ్యూహాత్మక చర్య. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అలాంటి సమయంలో దేశంలో తగినంత నిల్వలు ఉంటే, ధరలు ఎక్కువగా పెరగకుండా నియంత్రించవచ్చు. అలాగే రవాణా రంగం, వ్యవసాయం, పరిశ్రమలు అంతరాయం లేకుండా కొనసాగవచ్చు. దీర్ఘకాలికంగా చూస్తే ఈ చర్య ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుంది. అయితే నిల్వలు పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నిల్వ ఖర్చులు భారీగా ఉంటాయి. ఆయిల్ కంపెనీలపై ఈ భారాన్ని ఎలా పంచాలనేది కూడా ముఖ్యమైన అంశం.పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పుడు చమురు సరఫరా ఎప్పుడైనా ప్రభావితం కావచ్చు. భారతదేశం వంటి దిగుమతి ఆధారిత దేశాలకు ఇది పెద్ద సవాల్. అందుకే ప్రభుత్వం ముందస్తుగా నిల్వలు పెంచి, సంక్షోభం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ చర్య ద్వారా దేశం ఆకస్మిక సంక్షోభాలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఇంధన భద్రతపై దృష్టి పెట్టిన ఇతర దేశాలతో సమానంగా భారతదేశం కూడా అడుగులేస్తోంది. దీర్ఘకాలంలో ఇంధన వైవిధ్యీకరణవైపు కూడా అడుగులేయడం మరింత మంచిదని నిపుణుల అభిప్రాయం.పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన నిల్వలను 50 శాతం పెంచే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ ఇంధన భద్రతకు ముఖ్యమైన అడుగు. 60 రోజుల నుంచి 90 రోజులకు నిల్వలు పెంచడం ద్వారా ఆకస్మిక సరఫరా అంతరాయాలను ఎదుర్కోవచ్చు. ఈ చర్య ఆర్థిక స్థిరత్వం, ధరల నియంత్రణ మరియు దేశ భద్రతకు దోహదపడుతుంది.

# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

హైదరాబాద్ జూన్ 13, : రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్డ్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల అక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం




తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

# పబ్లిక్ గార్డెన్ టూ లక్డీకాపూల్

**- 1.5 కిలోమీటర్ల వై షేప్ లో ఫ్లైఓవర్**

హైదరాబాద్ జూన్ 13, : హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా కోర్ సిటీ పరిధిలోని నాంపల్లి, అసెంబ్లీ, లక్డీకాపూల్ మార్గాల్లో నిత్యం నరకంగా మారుతున్న వాహనాల రద్దీని నియంత్రించడానికి సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. పబ్లిక్ గార్డెన్ నుంచి అసెంబ్లీ వెనుక వైపుగా లక్డీకాపూల్ వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున ఆంగ్ల అక్షరం 'జ' (వై) ఆకారంలో నిర్మించ తలపెట్టిన ఈ వంతెనకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ప్రణాళికలు, డిజైన్లను సిద్ధం చేసింది.సాధారణంగా నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణాల సమయంలో ప్రైవేటు ఆస్తుల సేకరణ పెద్ద సవాలుగా మారుతోంది. భూసేకరణ కారణంగా కోర్టు కేసులు, పరిహారం వివాదాలు తలెత్తి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి ఆలస్యం అవుతున్నాయి. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రతిపాదిత వంతెనను గరిష్ఠంగా ప్రభుత్వ భూముల్లోనే నిర్మించేలా అధికారులు చాకచక్యంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో హెచ్ఎండీఏ ఇప్పటికే సమగ్ర సర్వేను పూర్తి చేసింది. దాదాపు 99 శాతం వరకు ప్రభుత్వ ఆస్తులను కేటాయించింది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తుల అవసరం ఎక్కువగా లేకుండా, ఎక్కడా వివాదాలకు తావులేకుండా ఈ ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను రూపొందించింది.ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ముందు భాగం నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి పబ్లిక్ గార్డెన్ మీదుగా, అసెంబ్లీ వెనుక వైపు నుంచి రైల్వే లైన్ వెంబడి ముందుకు సాగుతుంది. లక్డీకాపూల్ వద్దకు చేరుకోగానే ఈ వంతెన రైల్వే లైన్ మీదుగా ప్రయాణించి లక్డీకాపూల్ జంక్షన్‌ను దాటుతుంది. ఇక్కడే అసలు ఇంజినీరింగ్ అద్భుతం జరగనుంది. జంక్షన్ దాటిన తర్వాత ఈ ఫ్లైఓవర్ రెండుగా చీలిపోతుంది. అంటే 'వై' షేప్‌గా మారుతుంది. ఇందులో ఒక మార్గం నేరుగా మాసబ్ ట్యాంక్ వైపు వెళ్లే రహదారికి, మరో మార్గం ఖైరతాబాద్ వైపు వెళ్లే రహదారికి అనుసంధానం అవుతుంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కంటే ముందే లక్డీకాపూల్ ప్రధాన రహదారిపై ఈ వంతెన ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు.హైదరాబాద్-విజయవాడ రహదారికి అనుసంధానంగా ఉండే ఈ కోర్ సిటీ రూట్‌లో భారీ వాహనాల రాకపోకల వల్ల రాత్రి వేళల్లోనూ తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో విధించే ఆంక్షల వల్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కొత్త వంతెన అందుబాటులోకి వస్తే నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ఖైరతాబాద్ లేదా మాసబ్ ట్యాంక్ వైపు సిగ్నల్ ఫ్రీగా వెళ్లవచ్చు. అయితే, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దీనిని పూర్తిగా 'వన్-వే'గా మార్చనున్నారు. నాంపల్లి నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే దీనిపై అనుమతి ఉంటుంది. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలను దీనిపైకి అనుమతించరు.

# బోడుప్పల్‌లో అనుమతులు లేకుండా నడుస్తున్న నైన్ ఎడ్యుకేషన్ కళాశాల

**- విద్యార్థులను మోసం చేస్తున్న పలు యాజమాన్యాలు..**

**- ఏటా ఇదే తంతు.. పట్టించుకోని అధికారులు**

**- అనుమతి లేని కళాశాలలను మూసివేయాలి..**

**- ఎండి అన్వర్,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి**

బోడుప్పల్,జూన్ 13(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : 2026-27 నూతన విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభమవుతున్న తరుణంలో గ్రేటర్‌లోని ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు జోరందుకున్నాయి. తమ పిల్లలను మంచి విద్యాసంస్థల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆరాట పడుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొన్ని కళాశాలలు దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రధానంగా అనుమతి లేని కాలేజీలు డిస్కౌంట్ పేరుతో విద్యార్థులను మోసగిస్తున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వివరాలలోకి వెళితే మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధి అశోక్ నగర్ లో నైన్ ఎడ్యుకేషన్ పేరుతో నిర్వహిస్తున్న అనుమతి లేని కళాశాల వద్ద మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.జిల్లాలో అనుమతుల్లేని కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు.అనుమతి లేకుండానే..... అడ్మిషన్లు తీసుకుంటూ... లక్షలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా కళాశాలల పేరుతో పుస్తకాలు ముద్రించి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. వాటిపై ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ




వ్యాపారానికి కళ్లెం వేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించగా సంబంధిత సంస్థకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు జారీ కాలేదని పేర్కొన్నట్లు చెప్పారు. అలాగే తల్లిదండ్రులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అనుమతులు లేని సంస్థల్లో తరగతులకు హాజరు కాకుండా అవగాహన కల్పించాలని సూచించినట్లు తెలిపారు.

ఐఐటీ, నీట్, శాట్ కోచింగ్ పేరుతో విద్యార్థులను ఆకర్షిస్తున్న ఈ సంస్థకు మున్సిపల్, టౌన్ ప్లానింగ్, ఫైర్ సేఫ్టీ, విద్యాశాఖ అనుమతులు ఉన్నాయా అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**పర్మిషన్ లేకున్నా.. అడ్డగోలుగా..!**

గ్రేటర్‌లో ఏటా ఇంటర్మీడియట్ కాలేజీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పది మంది అధ్యాపకులు కలిసి చిన్నపాటి గదులను కిరాయుకి తీసుకుని తరగతులను ప్రారంభిస్తున్నారు. తమ వద్ద నాణ్యమైన విద్యనందిస్తామని అడ్మిషన్ల సమయంలో ఫ్లెక్సీలు, కరపత్రాలతో పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. పేరొందిన కాలేజీల కంటే తాము 30-40 శాతం వరకు తక్కువ ఫీజుతో బోధనలు అందిస్తామని, ఐఐటీ, జేఈఈ, నీట్ క్లాసులను ప్రత్యేకంగా అందిస్తామని తల్లిదండ్రులను నమ్మిస్తున్నారు. అయితే అక్కడ




చేరుతున్న విద్యార్థుల నామినల్ రోల్స్‌ను ఇతర కళాశాలల ద్వారా ఇంటర్‌బోర్డుకు పంపించడం, పాసైన తర్వాత టీసీలు, బోనఫైడ్ సర్టిఫికెట్లను అక్కడి నుంచే ఇప్పిస్తుండడంతో పేరెంట్స్ ఆందోళనకు గురవుతున్నారు. తక్కువ ఫీజు అని చెబితే చేర్పించిన పాపానికి నిలువునా మోసం చేస్తున్నారని, పరీక్షల్లో పిల్లలకు ఆశించిన మార్కులు కూడా రావడంలేదని వారు వాపోతున్నారు.


**అనుమతి లేని వాటిని మూసివేయాలి..ఎండి అన్వర్,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి**

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య కీలకమని, అడ్మిషన్లు తీసుకునే సమయంలో మంచి కాలేజీలను ఎంచుకుని పిల్లలను చేర్పించాలని, లేకుంటే వారి భవిష్యత్ ఆగమవుతుందని విద్యార్థి సంఘాల నాయకులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. తక్కువ ఫీజుతో ఇంటర్ కోర్సులు చెబుతామని ప్రచారం చేసే యాజమాన్యాల మాటలను విని మోసపోవద్దని, అసలు కాలేజీలకు ఇంటర్‌బోర్డు నుంచి అనుమతి ఉందా, లేదా అనే విషయాన్ని తెలుసుకోవాలంటున్నారు. అనుమతి లేని కాలేజీలపై చర్యలు తీసుకుని వాటిని మూసివేయాలని డీవైఎఫ్ఐ హైదరాబాద్ నగర కార్యదర్శి ఎండీ జావిద్ అధికారులను డిమాండ్ చేశారు.

## ఎల్ఓసి కాఫీ ని అందజేసిన ఎమ్మెల్యే విజయుడు

ఇటిక్యాల జూన్ 13 (విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం షాబాద్ గ్రామానికి చెందిన యస్. మద్దిలేటి ఆపరేషన్ కొరకు 5,00,000- రూపాయల ఎల్ఓసి కాఫీని అలంపూర్ శాసనసభ్యులు విజయుడు చేతులమీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## పాము కాటుతో వృద్ధురాలు మృతి...

దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ : రేకుల షెడ్డులో నిల్వ కట్టెలను తీస్తుండగా పాము కాటుకు గురై వృద్ధురాలు మృతి చెందిన ఘటన దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కే.కీర్తి రాజు తెలిపిన వివరాలు.... రామక్కపేటకు చెందిన గంగల లక్ష్మి (60) అనే వృద్ధురాలు ఇద్దరు కుమారులతో కలిసి జీవనం కొనసాగిస్తుంది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం తన ఇంటి ముందు గల రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన కట్టెలను పైకితీస్తున్న క్రమంలో ఒక గుర్తు తెలియని పాము ఆమె కుడి చేతిపై కాటు వేసింది.వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు లక్ష్మి మృతి చెందింది. మృతురాలి కుమారుడు చంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శనగ రైతులకు రూ. 69.06 కోట్ల చెల్లింపులు పూర్తి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13, (విజన్ ఆంధ్ర ) ఆదిలాబాద్ జిల్లాలో యాసంగి సీజన్ 2025-26 కు గాను మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధరకు శనగ పంటను విక్రయించిన రైతులకు నిధుల చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, జిల్లా వ్యవసాయ శాఖ నివేదికను అనుసరించి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మొత్తం 10 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి శనగల సేకరణ చేపట్టామన్నారు. జిల్లాలోని 5,813 మంది రైతుల నుండి క్వింటాళ్‌కు రూ. 5,875/- మద్దతు ధర చొప్పున, మొత్తం 1.18 లక్షల క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేశామని, వీటి మొత్తం విలువ రూ. 69.33 కోట్లు అని ఆయన వివరించారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి నిధులను విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా మొదటి విడత కింద రూ. 64.12 కోట్లను మార్క్ ఫెడ్ ప్రధాన కార్యాలయం నుండి జిల్లా కార్యాలయానికి విడుదల చేయగా, ఆ మొత్తాన్ని ఆర్.టి.జి.ఎస్. లేదా నెఫ్ట్ ద్వారా నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి విడుదల కావాల్సిన మిగిలిన బకాయిల్లో రూ. 5.19 కోట్లు నిన్న (12.06.2026 న) మార్క్ ఫెడ్ ప్రధాన కార్యాలయం నుండి జిల్లా కార్యాలయానికి చేరాయని, ఈ నిధులను శనివారం (13.06.2026 న) రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి విజయవంతంగా జమ చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం నుండి ఇంకా రావాల్సిన మిగిలిన రూ. 2.67 లక్షల స్వల్ప బకాయిలు సైతం త్వరలోనే విడుదలవుతాయని, అవి అందిన వెంటనే లబ్ధిదారులైన రైతులకు చెల్లింపులు జరుపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలోని శనగ రైతులందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## హనుమాన్ టేకిడిలో రూ 25 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభం



అల్వాల్, జూన్ 13 (విజన్ ఆంధ్ర): మచ్చబొల్లారంలోని పురాతన ప్రాంతాలలో ఒకటైన హనుమాన్ టేకిడిలోని వివిధ ప్రదేశాలలో రూ 25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు పనులను శనివారం మాజీ కార్పొరేటర్, రాజ్ జితేందర్ నాథ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇక్కడ అనేక అంతర్గత రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయ న్నారు. దీని వల్ల స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలిగిందని, రోడ్డు కనెక్టివిటీని మెరుగు పరచడానికి, ప్రజల సౌకర్యా న్ని మెరుగు పరచడానికి గుర్తించిన అన్ని దెబ్బతిన్న ప్రాంతాలలో కొత్తగా సిసి రోడ్లు వేస్తున్నామని తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు నిరుప, నీలవేణి, హేమలత, బుజ్జి, గణేష్, ఈశ్వర్, మహేష్, శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయ కులు సురేందర్ రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్ గౌడ్, సర్వేష్ యాదవ్, సంపత్ యాదవ్, డి.స్వామి, వెంకటేష్ గౌడ్, దేవా, సందీప్, ఆనంద్, కేసీఆర్, విష్ణు, రమేష్, రాజు, భీమ్, నర్సింగ్, అరుణ్, రాజేందర్, జితేందర్, దుర్గేష్, రాజ్ యాదవ్, కొండల్ రెడ్డి, వెంకటేష్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తుంది.

**-మంత్రి జూపల్లి కృష్ణారావు**




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 13, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు విలేకరుల సమావేశం నిర్వహించి జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో సంక్షేమ పథకాల అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శాసనసభ్యులు వెడ్మ బొజ్జ పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష,ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'నేచర్స్ లెగసీ' ఫోటోగ్రఫీ ప్రదర్శన ప్రారంభం



హైదరాబాద్, జూన్ 13 (విజన్ ఆంధ్ర) : ప్రముఖ వన్యప్రాణి ఛాయాచిత్రకారుడు హైమాకర్ వల్లూరి రూపొందించిన 'నేచర్స్ లెగసీ' వన్యప్రాణి, ప్రకృతి ఛాయాచిత్రాల ప్రదర్శనను హైదరాబాద్ లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్ఎండీఏ ప్రత్యేక అధికారి జయేష్ రంజన్ ఐఏఎస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా ట్రస్టీ, హైదరాబాద్ కార్యాలయ చైర్మన్ అనిల్ కుమార్ వి.ఈపూర్, భారత ప్రభుత్వ మాజీ శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి డా.శ్రీవారి చంద్రశేఖర్, ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్, ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అనూప్ సింగ్ ఐఎఫ్ఎస్ పాల్గొన్నారు. జూన్ 14 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో హైమాకర్ వల్లూరి రెండు దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా చిత్రీకరించిన అరుదైన వన్యప్రాణులు, ప్రకృతి దృశ్యాల ఛాయాచిత్రాలు ప్రదర్శిస్తున్నారు. ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని ప్రముఖులు అభిప్రాయపడ్డారు. హైమాకర్ వల్లూరి మాట్లాడుతూ, ప్రకృతి వైవిధ్యం, అందం, పరిరక్షణ అవసరాన్ని ప్రజలకు చేరవేయడమే 'నేచర్స్ లెగసీ' లక్ష్యమని తెలిపారు. తెలంగాణ జీవ వైవిధ్యంపై ప్రత్యేక ఫోటో ఆల్బమ్ రూపొందించాలని జయేష్ రంజన్ సూచించారు.

# సిమ్స్ కాలేజీలో కలకలం!!




- డిన్నర్ వికటించి 8 మంది మెడికోలకు అస్వస్థత
- ప్రైవేట్ రెస్టారెంట్ ఫుడ్ పాయిజన్
- కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో చికిత్స పొందుతున్న స్టూడెంట్స్
- ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ పర్యవేక్షణ లోపమేనా?
- చర్యలకు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 13 (విజన్ ఆంధ్ర)** భవిష్యత్తులో ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన కాబోయే డాక్టర్లు.. నేడు ప్రాణాంతకమైన నిర్లక్ష్యానికి బలై ఆసుపత్రి బెడ్‌పై కొట్టుమిట్టాడుతున్నారు. రామగుండం సిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఒకరిద్దరు కాదు.. ఏకంగా ఎనిమిది మంది మెడికల్ విద్యార్థులు తీవ్ర వాంతులు, విరోచనాలతో రామగుండం గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఆ రాత్రి (శుక్రవారం) ఏం జరిగింది?**

లభించిన సమాచారం ప్రకారం.. శుక్రవారం రాత్రి సిమ్స్ కాలేజీకి చెందిన 11 మంది విద్యార్థులు బయట ఉన్న 'డెస్టినేషన్ రెస్టారెంట్'కు డిన్నర్ కోసం వెళ్లారు. అక్కడ వారు తీసుకున్న ఆహారం పూర్తిగా వికటించింది. తిన్న కొద్దిసేపటికే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అర్ధరాత్రి వేళ ఒక్కొక్కరికీ విపరీతమైన వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి మొదలయ్యాయి. పరిస్థితి విషమించడంతో వెంటనే వారిని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎనిమిది మంది మెడికోలు అక్కడే చికిత్స పొందుతుండగా, మిగతా వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

**కాలేజ్ ప్రిన్సిపాల్, వార్డెన్ నిద్రిస్తున్నారా?**

**ఘాటుగా ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు!!**

ఈ దారుణ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే మెడికల్ విద్యార్థులకు, రాత్రి పూట అంతమందికి బయట రెస్టారెంట్లకు వెళ్ళడానికి అనుమతులు ఎలా ఇస్తున్నారు?
ఇది ముమ్మాటికీ కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ల పర్యవేక్షణ లోపమే!!లి విద్యార్థుల భద్రతను గాలికి వదిలేసి, వారు ఎటు వెళు తున్నారు, ఏం తింటున్నారు అనే కనీస పట్టింపు లేకుండా వ్యవహరించడం వల్లే ఈరోజు ఇంత పెద్ద ప్రమాదం జరిగింది.



**జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరు?**

తమ పిల్లలను డాక్టర్లను చేయాలని ఎన్నో ఆశలతో, నమ్మకంతో కాలేజ్ యాజమాన్యానికి అప్పగిస్తే, కనీస పర్యవేక్షణ లేకపోవడం ఏంటని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**బాధ్యత ఎవరిది?**

రేపు పొద్దున ఆసుపత్రిలో ఉన్న విద్యార్థులకు జరగరానిది ఏదైనా జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? కాలేజ్ ప్రిన్సిపాలా? హాస్టల్ వార్డెనా? లేక నాసిరకం ఆహారం పెట్టిన సదరు రెస్టారెంట్ యాజమాన్యమా?



**సమాధానం చెప్పేది ఎవరు?**

తమ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే, కన్నవారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులకు లేదా?

**కఠిన చర్యలకు డిమాండ్**

విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకున్న ఆ డెస్టినేషన్ రెస్టారెంట్‌పై తక్షణమే ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడి చేసి, సీజ్ చేయాలని.. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన కాలేజ్ ప్రిన్సిపాల్, వార్డెన్‌లపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఘాటుగా డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గోదారమ్మ పై ఆంధ్రుడి కన్ను...

- తల్లడిల్లుతున్న గోదావరి భారీ యంత్రాలతో ఇసుకతోలకాలు...
- తొలకరి పలకరింపుతో పగలు రాత్రి తేడా లేకుండా టిప్పర్లు ఉరుకులు పరుగులు...
- డీ సిల్టింగ్ పేరుతో అక్రమ ఇసుక దందా
- దోపిడీకి గురవుతున్న తెలంగాణ గిరిజన ఇసుక సొసైటీ వాసులు...
- గోదావరి నీటి ప్రవాహానికి గ్రావెల్ తో అడ్డుకట్ట
- ఆంధ్రావాలాకు వత్తాసు పలుకుతున్న మణుగూరు రెవిన్యూ ఉన్నతాధికారి..





మణుగూరు, జూన్ 13,(విజన్ ఆంధ్ర): తెలంగాణ ఇసుక ర్యాంపులలో ఆంధ్రావాలాలు కాంట్రాక్టర్ రూపం ఎత్తి గోదావరి పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్ లను చేజిక్కించుకుంటూ కోట్ల రూపాయల తెలంగాణ సొమ్మును ఆంధ్రకు పట్టుకెళు తున్నారంటే నమ్మదగ్గ విషయమే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజావరం ఇసుక ర్యాంపులో ఆంధ్ర ప్రాంతానికి చెందిన చిన్న బాబు పెద్ద బాబు లు తిష్ట వేసి డీ సిల్టింగ్ పేరుతో అమాయక గిరిజన సొసైటీల కు కుచ్చుటోపి పెడుతూ ...వందల సంఖ్యల టిప్పర్లతో పారుతున్న గోదావరికి అడ్డుకట్ట వేసి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ ఇసుక తరలిస్తున్నారు. రామానుజరం గ్రామం చుట్టూ ఇసుక కుప్పలు గుట్టలను తలపిస్తున్నాయి. జెసిపిలకు, టిప్పర్లకు ప్రత్యేకంగా డీజిల్ ట్యాంకర్ ను ఏర్పాటు చేశారంటే అతగాడు గోదావరి తల్లి గుండెలను ఎలా చీల్చుతున్నాడో అర్థం అవుతుంది. గోదావరిలో జెసిపి సహాయంతో మూడు నుండి నాలుగు మీటర్ల లోతు తీస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఇసుక ర్యాంపుకు దూరంగా టిఎండిసి అధికారులు ఉండటంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి మధ్యగా రహదారి నిర్మాణం కోసం వేల సంఖ్యలో టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలించి రహదారిని నిర్మించినా మణుగూరు మండల రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడకపోవడం గమనార్హం. తెలంగాణ ఇసుక ర్యాంపులో ఆంధ్రా వాళ్ళ పెత్తనం ఏంటనే ప్రశ్న ప్రజల్లో మెదులుతుంది. వేల సంఖ్యలో టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్న అధికారులు మామూళ్ల మత్తులో మగ్గుతున్నారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

***మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేసిన ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ సభ్యులు***



ప్రొద్దుటూరు,జూన్ 13: (విజన్ ఆంధ్ర) ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. శనివారం ప్రొద్దుటూరు పర్యటనకు విచ్చేసిన మంత్రికి ఆర్&బి అతిథి గృహంలో జర్నలిస్టులు వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో మూడు భారీ మోసాల ఛేదనం

### సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం

### ప్రజలను మోసం చేస్తే సహించేది లేదు సిపి సుమతి



విజన్ ఆంధ్ర(13)మల్కాజ్‌గిరి : ఈ సాంకేతిక కాలంలో, అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసాలకు తెర లేపుతున్న నేరగాళ్లపై మల్కాజ్‌గిరి కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు, జూన్ 7నుంచి 13వరకు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో మూడు ప్రధాన సైబర్ మోసాలను ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు, దర్యాప్తులో దేశ వ్యాప్తంగా విస్తరించిన సైబర్ ముఠాలు స్థానిక యువతను, మ్యూల్ అకౌంట్ హోల్డర్లుగా వాడు కుంటున్నట్టు వెల్లడైంది, సిపి సుమతి ఆదేశాల మేరకు పోలీసుల ప్రత్యేక చొరవతో న్యాయస్థానం ద్వారా ఓ బాధితుడికి 50వేల రీఫండ్ కూడా అందజేశారు, మొదటి కేసులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ నిరుద్యోగి నుంచి 1.80లక్షలు వసూలు చేసిన మోసానికి సంబంధించి, హైదరాబాద్‌కు చెందిన సజ్జల వాసును పోలీసులు అరెస్ట్ చేశారు, నకిలీ ఉద్యోగ ఆఫర్ పేరుతో ప్రాసెసింగ్ ఫీజులు వసూలు చేసి నిందితులు మోసానికి పాల్పడినట్లు తేలింది, రెండో కేసులో స్టాక్ మార్కెట్ పెట్టు బడుల పేరుతో నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా 38.01లక్షలు కాజేసిన వ్యవహారంలో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ జుబేర్‌ను అదుపులోకి తీసుకున్నారు, వాట్సాప్ గ్రూపుల ద్వారా బాధితులను ఆకర్షించి, భారీ లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టించి మోసగించినట్లు పోలీసులు గుర్తించారు, మూడో కేసులో కస్టమర్ కేర్ ప్రతి నిధులమంటూ పరిచయం చేసుకుని, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాల ఆశ చూపి, 1.43కోట్లకు పైగా మోసం చేసిన కేసులో దాడియ శివసాయి అలియాస్ బిట్టును అరెస్ట్ చేశారు, మొదట చిన్న మొత్తాలు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించి నమ్మకం పొందిన తర్వాత భారీ మొత్తాలను కాజేసినట్లు వెల్లడైంది, ఈసందర్భంగా సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేస్తూ, గ్యారెంటీ లాభాలు, అధిక రాబడులు ఇస్తామనే పెట్టుబడి పథకాలను నమ్మ వద్దని, అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు, ట్రేడింగ్ ఖాతాల నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకోవడానికి అదనపు ఫీజులు చెల్లించాలని కోరితే అది మోసమని గుర్తించాలని సూచించారు, సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే 1930హెల్ప్ లైన్‌కు కాల్ చేయాలని, లేదా జాతీయ సైబర్ క్రైమ్ ఆన్లైన్లో ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు

## పూటన్‌పల్లి వద్ద కోర్టు నిర్మాణం చేపట్టాలి

**- విద్యార్థి, యువజన సంఘాల నాయకులు**



గద్వాల జూన్ 13 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని పూటన్‌పల్లి సమీపంలో ప్రతిపాదిత కోర్టు స్థలాన్ని శనివారం విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పూటన్‌పల్లి ప్రాంతంలో కోర్టు నిర్మాణం చేపడితే జిల్లా ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే కోర్టు నిర్మాణం వల్ల ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెంది, వ్యాపార, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమై గద్వాల్ పట్టణ అభివృద్ధికి దోహదపడుతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే కోర్టు నిర్మాణ పనులను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు.జిల్లా అధ్యక్షులు హాలింపాష, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ గద్వాల్ జిల్లా నాయకులు జమ్మిచేడు కార్తీక్, యూఎస్ ఎఫ్ఐ.రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి, టిఎన్ ఎస్ ఎఫ్.రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాన్, పివైఎల్.జిల్లా అధ్యక్షుడు బిరిల్లి దానయ్య, మహేష్, పరుశరామ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.